ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 37 | బుధవారం 5 నవంబర్ 2025 | పేజీలు - 10 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...
బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715

## స్వల్ప ప్రకంపనలు

### విజయ నగరంలో భయభ్రాంతులకు గురైన ప్రజలు

**విజయనగరం, నవంబర్ 4 :**
విజయనగరం పట్టణ, మండల పరిధిలో మంగళవారం వేకువజామున 4 గంటల 19 నిమిషాల సమయంలో భూమి కొన్ని సెకండ్ల పాటు కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విజయనగరం పట్టణ ప్రాంతం ఆర్ఎంబి జంక్షన్ , కేఎల్ పురం, టౌన్ లో మరికొన్ని ప్రాంతాల్లోను, విజయనగరం మండల పరిధిలో ముడుదాం, అంబటి వలస , చెల్లూరు మరికొన్ని గ్రామాల్లో కూడా భూమి కనిపించినట్లు ప్రజలు తెలిపిన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### హిందూపురంలో

## వందేభారత్ స్టాప్

### ఎంపీ. బి.కె.పార్థసారథి

**హిందూపురం, నవంబర్ 4 :**
వందే భారత్ రైలు పది రోజుల్లోపు హిందూపురంలో ఆగుతుందని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. హిందూపురానికి వచ్చిన ఆయన విలేకరలుతో మాట్లాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తాను రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్నతో మాట్లాడామని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ (మిగతా 2లో)

## కెనడా కూడా

### అమెరికా బాటలోనే కెనడా భారీగా విద్యార్థి వీసాలు తిరస్కరణ

**టోరంటో, నవంబర్ 4 :**
అమెరికా దారిలోనే కెనడా నిర్ణయాలు కూడా ఉంటున్నాయి. కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. దీంతో భారతీయ విద్యార్థుల విషయంలో తీవ్రంగా వ్యవహరిస్తున్నట్లు అర్థం అవుతోంది. (మిగతా 2లో)

# రైతన్నకు ఎంత కష్టం ఎంత నష్టం..!





- మొంథా తుఫాన్‌తో రైతులకు తీరని నష్టం..
- రైతులకు అందిన సాయంపై జగన్ ఆరా...
- రైతులను పూర్తిగా విస్మరించారని విమర్శ...
- సర్కార్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా ఉంది...
- కృష్ణా జిల్లాలో బాధిత రైతులను కలిసిన జగన్...

**విజయవాడ, నవంబర్ 4 :**
మొంథా తుఫాన్ ఏపీలో విధ్వంసమే సృష్టించింది.. తుఫాన్ బీభత్సం కారణంగా రైతన్నలకు ఎంత కష్టం వచ్చిందిచ ఎంత నష్టం వాటిల్లింది అని పరిశీలించేందుకు నేరుగా పంట పొలాల్లోకే వెళ్లారు. కృష్ణా జిల్లాలో తుఫాన్ బాధిత రైతులను కలిసిన వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. పంట నష్టంపై ఆరా తీశారు.. ప్రభుత్వం నుంచి ఏ మేరకు సాయం అందిందని అడిగి తెలుసుకున్న ఆయన.. కూటమి సర్కార్‌పై ధ్వజమెత్తారు.. రాష్ట్రంలో రైతు పరిస్థితి తెలుసుకోవాలంటే గ్రౌండ్ లోకి తిరిగి చూస్తే అర్థం అవుతుందన్నారు. ఈ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా, నిర్దయగా వ్యవహరిస్తుందని ఫైర్ అయ్యారు.. గోదావరి జిల్లాల నుంచి కర్నూల్ వరకు తుఫాను ఎఫెక్ట్ ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, గతంలో ఎప్పుడూ ఊహించని విధంగా పంట పొలాలు మొత్తం నేట మునగడం బాధాకరమన్నారు. తీవ్ర గాలులకు పంటలు పూర్తీగా దెబ్బతిని రైతుల ఆరుగాలం కష్టం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, మొక్కజొన్న, బత్తాయి పంటలు నాలుగు లక్షల ఎకరాల్లో మునిగాయన్నారు. 18 నెలల చంద్రబాబు ప్రభుత్వంలో16 సార్లు ప్రకృతి విపత్తులు సంభవింనప్పటికీ 18 నెలలుగా ఒక్క రైతుకైనా ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇచ్చారా..? ఇన్సూరెన్స్ డబ్బులు, పెట్టుబడి సాయం అందిందా..? అనినిలదీశారు.

2లో

### ఫేక్ వీడియోలు సృష్టిస్తే

## కేసుల మోత

### రైతుల త్యాగంతోనే అమరావతి నిర్మాణం..
### తుళ్లూరులో డీఎస్పీ కార్యాలయం ప్రారంభం..
### హెూం మంత్రి వంగలపూడి అనిత..



**అమరావతి, నవంబర్ 4 :**
రైతుల త్యాగంతోనే రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. తుళ్లూరులో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం పూర్తిచేస్తాం. (మిగతా 2లో)

## గిరిజన హాస్టళ్లకు మోక్షం

### గిరిజన వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కోసం రూ 113 కోట్లు




**అమరావతి, నవంబర్ 4 :**
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తొమ్మిది ఐ.టి.డి.ఏ.లోనున్న 757 గిరిజ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.113 కోట్లను మంజూరు చేసినట్లు రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఇందులో రూ.83 కోట్లను గిరిజన ఆశ్రమ పాఠశాలకు రూ.30 కోట్లను గురుకుల పాఠశాలలకు ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో (మిగతా 2లో)

### మన జీవన విధానంలో

## వ్యవసాయం ఒక భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం..
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం..
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం..
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి ..



**హైదరాబాద్, నవంబర్ 4 :**
దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని 54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా (మిగతా 2లో)

### భోగాపురం విమానశ్రయం

## ఏపీ అభివృద్ధికి కేంద్రం

- పారిశ్రామిక అభివృద్ధికి అతి కీలకం......
- వచ్చే నెలలోనే ట్రయల్ రన్ నిర్వహిస్తాం.......
- కేంద్రపౌరవిమానయాన మంత్రి రామ్మోహన్.....



**విజయనగరం, నవంబర్ 4 :**
ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం విమానాశ్రయం నిలుస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. దీనిని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. విశాఖ అభివృద్ధిలో భోగాపురం కీలకం కానుందన్నారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం 91.7 శాతం పూర్తి అయిందని పేర్కొన్నారు. మంగళవారం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ పనులని రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నాగమాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఉత్తరాంధ్రా సంస్కృతికి ప్రతిబింభంగా భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్నితీర్చిదిద్దుతున్నామని (మిగతా 2లో)

## ఉల్లి రైతుల్ని ఆదుకోండి

### కలెక్టర్‌ను కలిసి విన్నవించిన ఎంపి అవినాశ్ రెడ్డి



**కడప, నవంబర్ 4 :**
ఉల్లి రైతుల సమస్యలని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి డిమాండ్ చేశారు. 17 వేల ఎకరాల్లో ఉల్లి రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. కడప కలెక్టర్ శ్రీధర్‌నిమంగళవారం కలిసిన ఎంపీ అవినాష్ రెడ్డి సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కలెక్టర్‌ని కలిసి ఉల్లి రైతుల సమస్యలని వెంటనే పరిష్కరించాలని కోరానని చెప్పుకొచ్చారు. అక్టోబరులో కూడా ఈ విషయంపై కలెక్టర్ శ్రీధర్‌ని కలిశానని గుర్తుచేశారు అవినాశ్ రెడ్డి. హెక్టార్‌కు రూ.50 వేలమద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. (మిగతా 2లో)



# రోడ్ల నిర్మాణంలో నో కాంప్రమైస్

### గ్రామీణ రహదారులకు మహర్దశ...సాస్కి నిధులతో రోడ్ల పునర్నిర్మాణం..
### తక్షణమే పంచాయితీరాజ్ రోడ్ల పునరుద్దరణ..నాణ్యతా ప్రమాణాలలో రాజీవద్దు..
### అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్...

**అమరావతి, నవంబర్ 4 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది.. సాస్కి.. పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2వేల కోట్లు మంజూరు చేశారు.. ఈ నిధులను వినియోగించి గ్రామాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మిం చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ , గ్రామీణాభి వృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ ఉండదు అని స్పష్టం చేశారు..రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు ప్రమాణాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. నిర్మాణం ప్రారంభమైన తర్వాత పలు దశల్లో క్వాలిటీ చెక్ తప్పనిసరి.. ప్రమాణాలకు విరుద్ధంగా పనులు జరిగినా, అవకతవకలు నమోదైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో అక్కడి పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. కేంద్రంలో ప్రధానమంత్రినరేంద్ర మోడీ సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంతో ప్రతి గ్రామానికీ పటిష్టమైన, బలమైన రహదారులు అందించడమే లక్ష్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.. సాస్కి'పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కల్యాణ్‌దిశానిర్దేశర చేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు. (మిగతా 2లో)

## రైతులపై కపట ప్రేమ వద్దు

- గత ఐదేళ్లలో ఏం చేశారో అందరికీ తెలుసు..
- ఉల్లి రైతులకు హెక్టార్‌కు 50వేల చెల్లింపు..
- కడప ఎంపి అవినాశ్‌కు కౌంటర్ ఇచ్చిన మంత్రి అచ్చన్నాయుడు..



**అమరావతి, నవంబర్ 4 :**
రైతుల పేరు మీద వైసీపీ నేతలు చేస్తున్న నాటకాలు ఆపాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హితవు పలికారు. కడప జిల్లాలో ఏమి జరుగుతోందో చూడని అవినాశ్‌కి.. ఇప్పుడు రైతులపై అంత ఆకస్మికంగా ప్రేమ ఎందుకు.. వచ్చిందని ప్రశ్నించారు. ఈ మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉల్లి రైతులు నష్టపోకూడదని సీఎం చంద్రబాబు ఆలోచించి హెక్టార్‌కి రూ.50,000 చొప్పున అందజేయాలని నిర్ణయించారని తెలిపారు. తమ ప్రభుత్వంలో రూ.104 కోట్ల 57లక్షల ఉల్లి రైతులకు లబ్ది చేకూరుతుందని వెల్లడించారు. ఉల్లి ధరలు తగ్గుముఖం (మిగతా 2లో)

# కేసుల మోత..




(మొదటి పేజి (తరువాయి)

పోలీసులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తాం. ప్రతిపక్షాల ఆరోపణలను దీటుగా ఎదుర్కొంటాం. పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం తగదు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను సహించం. పోలీసులకు నూతన సాంకేతికతను అందిస్తాం. 6100 పోస్టులను భర్తీ చేస్తున్నాం అని అనిత అన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... తుళ్లూరు పోలీస్ సభ డివిజన్ కొత్త ఆఫీస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని.. దీని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలని అన్నారు. 2014లో సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణం ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కార్యాలయం పూర్తి కాకుండా ఉందని తెలిపారు. రాజధాని కొరకు రైతులు ఉచితంగా భూములు త్యాగం చెయ్యడం గొప్ప విషయమన్నారు. అమరావతి రైతుల కష్టం.. ప్రతి ఫలమే ఇవాళ అందరూ చూస్తునారని హోంమంత్రి అన్నారు. ఈ బిల్డింగ్ పూర్తి చేయడానికి ఎస్పీ వకుల్ జిందల్, డీఎస్పీ మురళీ కృష్ణ చాలా కృషి చేశారని కొనియాడారు. పోలీస్ వ్యవస్థను బాగా బలోపేతం చేసేందుకు డీజీపీ కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసులకు కావాల్సిన అన్ని ఫెసిలిటీస్ కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. పోలీసులకు కోటి రూపాయలు వరకు భీమా కల్పిచామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే 6100 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పోలీసు చనిపోతే.. వారి కుటుంబానికి అండగా ఉంటామని.. భీమా ద్వారా కనిష్టంగా రూ.15 లక్షలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందని.. త్వరలో అన్నీ ఫుల్ ఫిల్ చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు. కల్పిత వీడియోల ద్వారా చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని.. అలాంటి వాటిని ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్య కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ లారీపై రాళ్లు వేసిన వీడియోను.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లు వైసీపీ ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు వార్తలను ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించి.. తప్పుడు వార్తలు స్ప్రెడ్ కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# రైతన్నకు ఎంత కష్టం.!



(మొదటి పేజి (తరువాయి)

పూర్తిగా ఈ ప్రభుత్వం రైతుల వెన్ను విరిచిందని జగన్ మర్శించారు. చివరికి ఉచిత పంటల బీమా కూడా లేకుండా పోయిందన్నారు. ఒక్కొక్క రైతు వేల రూపాయల నుంచి లక్షల్లో నష్టపోయారన్నారు. ఎరువులు కూడా బ్లాకులో కొనుక్కోవాల్సి వచ్చిందన్నారు. ఇంత దారుణ పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవన్నారు.. ఇన్ని కష్టాలతో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ప్రతీ అడుగులో కూడా రైతు నష్టపోతున్నారనన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలబడ్డాం.. ఒక్క రైతు కూడా భయపడలేదు, అందరికీ భరోసా ఉంది, అన్న ఉన్నాడన్న ధైర్యంతో ఉండేవారన్నారు. డబ్బులు వస్తే తర్వాత సీజన్ పెట్టుబడి పెట్టడానికి డబ్బులు అందేవన్నారు. ఏ రైతు కూడా ఈ ప్రభుత్వంలో సంతోషంగా లేరన్నారు.. ఆర్బీకేల పరిధిలో సచివాలయంతో అనుసంధానమై ఈ క్రాప్ బుకింగ్ నమోదయ్యేదన్నారు. రైతుకు ఎప్పుడు ఏ పంటకు ఇబ్బంది జరిగినా నష్టపరిహారం అందేదన్నారు. ప్రభుత్వం రైతులకోసం ఉంటుంది అనే భరోసా లభించేదన్నారు. ఎక్కడ పంట రేట్లు తగ్గినా ప్రభుత్వం స్పందించేదన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా మార్కెట్ లో కాంపిటీషన్ క్రియేట్ చేసి పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చే వాళ్లమని తెలిపారు. సీఎం యాప్ సాయంతో గతంలో అన్నీ అందుబాటులో ఉండేవని, అప్పట్లో 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. నష్ట పోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

# రోడ్ల నిర్మాణంలో నో కాంప్రమైజ్

(మొదటి పేజి (తరువాయి)

సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేశామని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2 వేల కోట్లు నిధులు సమకూర్చిందని వ్యాఖ్యానించారు. ఈ నిధులతో ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. ఈ క్రమంలో దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో ఏపీకి సాస్కి నిధులు సమకూరాయని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామని సూచించారు. ఈ నేపథ్యంలో సాస్కి నిధుల వినియోగించే ప్రణాళికపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని వివరించారు. ప్రత్యేక శ్రద్ధతో మన గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి సాస్కి నిధులు తీసుకువచ్చామని ఉద్ఘాటించారు. వీటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపైనా, అధికార యంత్రాంగంపైనా ఉందని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడే విధంగా నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీపడవద్దని మార్గనిర్దేశర చేశారు పవన్. రహదారుల నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా, ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదేనని హుకుం జారీ చేశారు. నిర్మాణం కాంట్రాక్టు పొందినవారికీ ముందుగానే నాణ్యతా ప్రమాణాల గురించి తెలియజేయాలని ఆదేశించారు. ఆ ప్రమాణాలకు తగ్గట్లు నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నిర్మాణం ప్రారంభించిన తర్వాత పలు దశల్లో క్వాలిటీ చెక్ చేయాలని ఆజ్ఞాపించారు. తాను, నిపుణులు క్షేత్ర స్థాయికి వెళ్లి నాణ్యతా ప్రమాణాలు పాటించారో లేదు తనిఖీ చేస్తామని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని.. ఏ మాత్రం అవకతవకలు జరిగినా ఉపేక్షించవద్దని హెచ్చరించారు,. ప్రజలకు పటిష్టమైన రోడ్లు అందించడం అవసరం. మౌలిక వసతుల కల్పనలో రహదారులు కీలకమైనవి. సాస్కి ద్వారా వస్తున్న రూ.2వేల కోట్లతో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు నిర్మించుకొనే అవకాశం వచ్చింది. ప్రత్యేకమైన ప్రాంతాల్లో, సందర్భాల్లో ఈ నిధుల నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయొచ్చు. పుట్టపర్తిలో సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా అక్కడ మౌలిక వసతులు కల్పనలో భాగంగా పంచాయతీ రోడ్లు పటిష్టపరచాలని ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు. ఇందుకోసం రూ.35 కోట్లను ఈ నిధుల నుంచి వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలాంటి కీలకమైన అభివృద్ధి పనులకు సాస్కి నిధులు ఎంతగానో తోడ్పడతాయి. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించింది. వివిధ మార్గాల్లో ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ, దానిని విస్మరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎప్పటికప్పుడు ఏపీలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తున్నాం. సాస్కి నిధులు విడుదల చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. నిధులు పొందటంలో, వాటిని వినియోగించే పక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలనే కృతనిశ్చయంతో ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# గిరిజన హాస్టళ్లకు మోక్షం

(మొదటి పేజి (తరువాయి)

మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకై గత ఏడాది రూ.155 కోట్లను వెచ్చించడం జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా మరిన్ని మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో రూ.113 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 757 గిరిజ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 199 గురుకులాలు, 558 ఆశ్రమ పాఠశాలలు ఉన్నట్లు ఆమె తెలిపారు. వీటన్నింటిలో ఆర్.ఓ. ప్లాంట్లు, వాష్ రూమ్లులు, ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. వీటన్నింటినీ టాయిలెట్లు నిర్మాణానికి ఇప్పటికే 2,012 టాయిలెట్లను స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ ద్వారా మంజూరు చేశామని, వీటి నిర్మాణ పనులు ప్రగతిలోనున్నట్లు ఆమె తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునే వీలుగా అన్ని వసతి గృహాల్లో ప్రిపెయిడ్ పోన్లు, కాయిన్ పోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. డిఎస్సీ ద్వారా 16 వేల పోస్టులకు పైబడి ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల అన్ని గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిండుగా ఉన్నారని, ఇప్పటికే ఉన్న 1100 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎవరినీ తొలగించ కుండా వారి సేవలను కూడా వినియోగించుకోవడం జరుగుచున్నదని ఆమె తెలిపారు. 150 మంది మెరిటోరియస్ విద్యార్థులను గుర్తించి వారికి ఐఐటి, ఎన్.ఐ.టి., నీట్ పోటీ పరీక్షల కోచింగ్ ను పార్వతీపురం, సీతంపేటలలో అందజేయడం జరుగుచున్నదని, మరో కేంద్రాన్ని త్వరలోనే విశాఖపట్నంలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 వేల మినీ అంగన్ వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా మార్చి ప్రతి కేంద్రానికి ఒక టీచర్ ను, ఆయాను నియమించడం జరిగిందన్నారు. సాక్షం అంగన్ వాడీలలో దృశ్య శ్రవణ విదానం ద్వారా విద్యాబోధన చెసేందుకు అవసరమైన టీవీ, పర్నిచర్ ను కొనుగోలు చేసే నిమిత్తం ఒక్కొక్క సాక్షం అంగన్ వాడీకి రూ.1.00 లక్షల చొప్పున మంజూరు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎటు వంటి ట్రైకార్ రుణాలను మంజూరు చేయడం జరుగలేదని, అయితే గిరిజనుల జీవనోపాధిని మెరుగు పర్చేందుకు తమ ప్రభుత్వం రూ.24 కోట్లతో గోకులాలను మంజూరు చేశామన్నారు. అదే విదంగా ట్రైకార్ రుణాలను కూడా అందజేయాలనే లక్ష్యంతో రూ.20 కోట్లను కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు. ఉపాధిహామీ పథకం క్రింద 150 రోజుల పాటు పనిదినాలను గిరిజనులకు కల్పించడం జరుగుచున్నదన్నారు. శ్రీశైలం అటవీ ప్రాంతంలో 42 గ్రామాలకు త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించే ప్రాజక్టును చేపట్టామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న చెంచులు, యానాదులకు ఆధార్ కార్డులు,రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుచున్నదని, తద్వారా వారికి గృహాలు, త్రాగునీటి సౌకర్యం, అంగన్ వాడీ కేంద్రాల ఏర్పాటు చేసే చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్. క్రింద భూపట్టాలను త్వరలో అందజేసే చర్యలను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. సికిల్సెల్ ఎనిమియాతో బాదపడే గిరిజన మహిళలకు ఐరన్, క్యాల్షియమ్ ఔషధాలను అందజేయడం జరుగుచున్నదని, వీరికి ప్రత్యేక చికిత్స అందజేసేందుకు విశాఖపట్నం కె.జి.హెచ్.లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

# వ్యవసాయం ఒక భాగం

(మొదటి పేజి (తరువాయి)

భారతదేశ వ్యవసాయరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించు కోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పు కొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఉల్లి రైతుల్ని ఆదుకోవాలి



(మొదటి పేజి (తరువాయి)

ఉల్లి రైతుల కోసం తక్షణం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం గతంలో చెప్పినా ఇప్పటిదాకా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో కలెక్టర్‌ని కలిసినప్పుడు ఉల్లి రైతులని ఆదుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నెల రోజులు అయినా సంబంధిత జీవో కూడా రాలేదని... సీఎం దగ్గర ్గ÷ల్ ఉందని కలెక్టర్ శ్రీధర్ చెబుతున్నారని తెలిపారు. రెండు వారాల్లో రైతులను ఆదుకోకపోతే ఆందోళన చేపడతామని చెప్పుకొచ్చారు అవినాశ్ రెడ్డి. ఫసల్ బీమాలో రైతుల కోసం రూ.173 కోట్లు వచ్చాయని కలెక్టర్ శ్రీధర్ చెబుతున్నారని అన్నారు. ఫసల్ బీమా పైసలని రైతులు ఎవరికీ ఇస్తున్నారో వివరాలు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. 2024 ఖరీఫ్ వరకు పెండింగ్‌లో ఉన్న ఫసల్ బీమాని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అన్ని రకాల పంటలు నీట మునిగాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయిన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే విధానం అమలు చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. ప్రభుత్వం అక్టోబరు 27వ తేదీ నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిందని.. అయినా ఇప్పటి దాకా ఎందుకు కొనుగోలు చేయలేదు. కడప జిల్లాలో 17 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఏపీ సర్కార్ చెప్పింది. తక్షణం ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి. గత ప్రభుత్వంలో మూడు వారాల్లో దిగుబడి చేతికి వచ్చే పంటలపై గిట్టుబాటు ధర ప్రకటించే వారు. కానీ ఈ ప్రభుత్వంలో ఎలాంటి విధానం లేదు. గతంలో దళారులు కూడా ప్రభుత్వం ప్రకటించిన ధరకే ధాన్యం కొనుగోలు చేసేవారు. గిట్టుబాటు ధర ప్రకటించచక పోవడం వల్ల తక్కువ ధరకే ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని ఎంపీ అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు.

# రైతులపై కపట ప్రేమ వద్దు

(మొదటి పేజి (తరువాయి)

పట్టినప్పుడు క్వింటాకు రూ.1200 వెచ్చించి మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్ నందు సుమారు రూ.17 కోట్ల 22 లక్షల విలువ గల ఉల్లి పంటను కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. ఉల్లి పంట పాడవ్వకుండా రైతులకు తమ ప్రభుత్వం మేలు చేసిందని వివరించారు. 2020లో వైసీపీ హయాంలో ఉల్లి ధర పడిపోతే మద్దతు ధర రూ.770లు ప్రకటించడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 129 మంది రైతుల నుంచి 970 మెట్రిక్ టన్నుల ఉల్లిని మాత్రమే సేకరించి, రైతులకు కేవలం రూ.75 లక్షలు మాత్రమే చెల్లించిన విషయం అవినాష్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు మంత్రి అచ్చెన్నాయుడు. జగన్ హయాంలో క్వింటాకు ఉల్లి ధర రూ.770 నిర్ణయించారని, కానీ రైతుల శ్రేయస్సు

కోసం సీఎం చంద్రబాబు ఉత్తమ నిర్ణయంతో క్వింటాకు రూ.1200 పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో రైతుల సమస్యలు అవినాశ్‌రెడ్డికి కనిపించలేదా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు, విపత్తుల సమయంలో మాత్రమే వైసీపీ నేతలు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు మంత్రి అచ్చెన్నాయుడు. గత ఐదేళ్లు రైతులు ఇబ్బందులు పడుతుంటే అవినాశ్ రెడ్డి కళ్లకు గంతలు కట్టుకుని ఉన్నారా..? అని ప్రశ్నించారు. నష్టపరిహారం ్గ÷ళ్లు పెండింగ్‌లో పెట్టింది కూటమి ప్రభుత్వం కాదని? గత జగన్ ప్రభుత్వ గందరగోళ విధానాలేనని ఎద్దేవా చేశారు. రైతుల పేరు చెప్పుకుంటూ రాజకీయ లాభం చూడటం అవినాశ్‌రెడ్డి స్వభావమని విమర్శించారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే కనీస అర్హత అవినాశ్‌రెడ్డికి లేదని ఫైర్ య్యారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉద్ఘాటించారు. అన్నదాతలకు అందచేస్తున్న పథకాలు, ధరలు తగ్గినప్పుడు వారికి ఇస్తున్న పరిహారాలు వైసీపీ నేతల కళ్లకు కనపడటం లేదా..? అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నల వర్షం కురిపించారు.

# వందేభారత్ స్టాప్

(మొదటి పేజి (తరువాయి)



పనులు చేపడుతున్నామని అన్నారు. బళ్లారి నుంచి మడకశిర మీదుగా రైల్వే ట్రాక్ పనులు వేగంగా సాగుతాయని అన్నారు. చాకర్లపల్లి రైల్వే గేటువద్ద ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, దీనికి రూ.29 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఏడాదిలోపే పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, రూ.92 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెనడా కూడా...

(మొదటి పేజి (తరువాయి)

కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

# ఏపీ అభివృద్ధికి కేంద్రం



(మొదటి పేజి (తరువాయి)

చెప్పుకొచ్చారు. వచ్చే నెలలో భోగాపురం విమానాశ్రయం నుంచి ట్రైయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీకాకుళం, భోగాపురంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో వచ్చే నెలలో జరుగనున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో భోగాపురం విమానాశ్రయ పరిసరాల్లో పలు పరిశ్రమల స్థాపనకు తగిన నివేదిక అందజేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ విమానాశ్రయంతో ఇక్కడ పారిశ్రామికంగా ఎంతగానో పురోగతి సాధిసతుందన్నారు.

# శ్రీవారికి వెండి గంగాళం వితరణ

**తిరుమల, నవంబర్ 4:**

ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కొండకు తరలి రావడం, స్వామిని దర్శించుకుని విరాళాలు అందించడం జరగుతోంది. ప్రతీరోజు కొన్ని వేల మంది ఆ గోవిందుడిని దర్శించుకుంటారు. అంతేకాకుండా ఎవరి స్తోమత బట్టి వారు స్వామికి విరాళాలు ఇస్తుంటారు. వజ్రాలు, బంగారం, వెండితో చేసిన ఆభరణాలు, వస్తువులు.. లేదా పెద్ద మొత్తంలో నగదును విరాళంగా అందజేసి ఆ శ్రీవారిపై తమ భక్తిని చాటుకుంటారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు కుటుంబంతో కలిసి శ్రీవారికి భారీ వెండి గంగాళాన్ని విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులు రెడ్డి అనే భక్తుడు (మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి రూ.30 లక్షలు విలువ చేసే 22 కేజీల వెండి గంగాళాన్ని విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు ఆలయ అధికారులకు గంగాళాన్ని భక్తుడు తన కుటుంబసభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# నిబంధనల ఉల్లంఘన

## పోలీసులతో వాగ్వాదానికి దిగిన మాజీ ఎమ్మెల్యే

**విజయవాడ, నవంబర్ 4:**

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో మాజీ సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసునిబంధనలను వైకాపా నేతలు ఉల్లంఘించారు. డీజే ఏర్పాటు చేయగా.. అనుమతి లేదని పోలీసులు దాన్ని తీయించారు. దీంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వైకాపా నేతల తీరుతో హైవేపై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హైవేపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దని పార్టీ నేతలకు పోలీసులు సూచించారు. గోపువానిపాలెంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే అనిల్, వైకాపా కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని అనిల్‌కుమార్‌కు చెప్పగా.. పోలీసులతో ఆయన వాగ్వాదానికి దిగారు. జగన్ కాన్వాయ్ కారణంగా పెనమలూరులో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. బందరు రోడ్డులో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద జగన్ కాన్వాయ్‌లోని వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఎంత మొర పెట్టుకుంటున్నా వినకుండా ఇష్టారీతిన కాన్వాయ్ ముందుకు సాగుతోంది. ఉయ్యూరులోనూ పలుచోట్ల ట్రాఫిక్‌జామ్ అయింది.

# విద్యారంగం సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

**ఎస్ఎఫ్ఐ నాయకులు ..**

**గుత్తి, నవంబర్ 4:**
విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను అధ్యయనం చేయడానికి తాడిపత్రి నుంచి ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ నాయకుల జీపుయాత్ర రెండవ రోజు గుత్తి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా గుత్తి పట్టణంలోని జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ నాణ్యమైన విద్యపై లేదన్నారు. అదేవిధంగా గుత్తి బాలికల కళాశాల అనుబంధంగా ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్కు అదనపు గదులు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీపు యాత్ర ఏడో తేదీ ముగింపు అనంతరం ఈ యాత్రలో పరిశీలనలో వచ్చిన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు నవీన్ యాదవ్, భీమేష్,వంశి, శివ, జిల్లా గుత్తి మండలాధ్యక్షుడు బాలాజీ,నాయకులు విజయ్, జవర్ధన్,ఓము, జనార్ధన్ చరణ్, అశోక్ రామకృష్ణతదితరులు పాల్గొన్నారు.



జీపుజాతాలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కోసం పావులు కలుపుతున్న పులికొండ!



**గుత్తి, నవంబర్ 4:**
జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గుత్తి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన పులికొండ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కోసం జోరుగా పావులు కదుపుతున్నారు. పులికొండ తెలుగుదేశం పార్టీలో పార్టీ ఆవిర్భావం నుండి క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గం ఆయనకు అనేక సందర్భాల్లో జిల్లా తెలుగుదేశం పార్టీలో స్థానం కల్పించింది. గతంలో జరిగిన మండల ప్రజా పరిషత్ ఎన్నికల్లోను ఆయన ను అప్పటి తెలుగుదేశం నాయకత్వం ఎంపీపీగా ఎన్నిక చేయడానికి సిద్ధమైంది. ఆఖరి సమయంలో అనూహ్యంగా ఆ పదవి వేరొకళ్ళకి దక్కడంతో కొంత నిరాశకు గురైన ఆయనను అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ తిరిగి క్రియాశీలకు రాజకీయాల్లో పాల్గొనాలని సూచించారు. అప్పటినుండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పులికొండ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. పార్టీకి పులికొండ సేవలను గుర్తించిన అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం లు పులికొండను కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా నియమించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు కి విజ్ఞప్తి చేశారు. అనేక దశాబ్దాలుగా పార్టీకి అంకితభావంతో సేవలు అందించిన పులికొండకు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వటం సముచితమవుతుందని ఆయనకు అవకాశం కల్పించాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# పుప్పాలలో వైసీపీ నాయకుల సంతకాల సేకరణ

**యాడికి, నవంబర్ 4 :**
యాడికి మండల పరిధిలోని పుప్పాల గ్రామంలో మంగళవారం వైయస్సార్సీపి నాయకులు రచ్చబండ నిర్వహించి కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. వై యస్ .జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా,కోటి సంతకాల సేకరణలో భాగంగా పుప్పాల గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వై. సుదర్శన్ డి. దేవేంద్ర. జి. ప్రసాద్. డి. రాజు. జి. ఈశ్వరెడ్డి. సి. లక్ష్మీరాగారెడ్డి. డి సుధాకర్. వై. వేంకట రాముడు. జి నాగేంద్ర. జి. కొండారెడ్డి. డి. గంగాధర్. జి. గంగారాజు ఎస్. ప్రభాకర్ ఎస్. శంకర్ చుట్ట. సుధాకర్ చుట్ట. గోపాల్. పుప్పాల గ్రామ వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు వైఎస్ఆర్సిపి అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.



పుప్పాల గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రజా సమస్యలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్..**

**గుత్తి, నవంబర్ 4:**
గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, గుత్తి పామిడి ఇన్చార్జ్ ఈశ్వర్ విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా జెడ్. వీరారెడ్డి కాలనీవాసులు గుమ్మనూరు ఈశ్వర్ తో మాట్లాడుతూ మా కాలనీ నందు ప్రధాన సమస్యలు రోడ్లు,మురికి కాలువలు, విద్యుత్ సమస్య మొదలగునవి చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని యువనేత గుమ్మనూరు ఈశ్వర్ కి విన్నవించారు,స్థానిక కాలనీవాసులు మాట్లాడుతూ లిఇంతవరకు ఏ నాయకుడు తమ కాలనీలోకి వచ్చి ఇలా ప్రతి ఇంటింటికీ తిరగలేదని ఈ రోజున మీరు వచ్చి కాలనీ పరిస్థితులు తెలుసుకొని అండగా నిలవడానికి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ గుత్తి పట్టణం నందు ప్రధానంగా జడ్ వీరారెడ్డి కాలనీ నందు రోడ్డు సమస్యలు విద్యుత్ సమస్యలు చాలా ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని అందుకే స్వయంగా మీ కష్టాలు తెలుసుకోవడానికి ఈరోజు మీ కాలనీకి రావడం జరిగిందని కచ్చితంగా వీలైనంత త్వరగా రోడ్డు సమస్య విద్యుత్ సమస్యను కచ్చితంగా తీరుస్తానని స్థానికులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ టిడిపి నాయకులు చికెన్ సీనా బండల ప్రసాద్ ఈశ్వరయ్య మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జెడ్ వీరారెడ్డి కాలనీలో పర్యటిస్తున్న టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ తదితరులు

# స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కల్పించండి

**బిజేపీ స్టేట్ సేల్స్ కన్వీనర్ కన్నంపల్లి చిరంజీవి రెడ్డి ..**

**తాడిపత్రి, నవంబర్ 4:**
స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని భారతీయ జనతా పార్టీ స్టేట్ సేల్స్ కన్వీనర్ కన్నంపల్లి చిరంజీవి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్యారడైజ్ హెూటల్ నందు మంగళవారం పట్టణ అధ్యక్షుడు చెన్నా రంగనాయకులు ఆధ్వర్యంలో సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, తాడిపత్రి మండల కమిటీ ఇన్ఛార్జ్ చిరంజీవి రెడ్డి హాజరైనారు. ఈసందర్భంగా చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి మండలం నందు మండల కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతి పోలింగ్ బూత్ నందు బూత్ అధ్యక్షులను, బూత్ కమిటీని నియమించాలన్నారు. మీడియా సెల్ కన్వీనర్, కో కన్వీనర్లు నియమించాలని తెలిపారు. ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించినారు. తాడిపత్రి పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి స్వదేశీ వస్తువులు వాడకం గురించి వివరించాలని, ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్ అంటించి వారికి స్వదేశీ వస్తువుల వలన ఉపయోగం తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడాలని వివరించాలన్నారు. దానివల్ల దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు కల్పించినట్లుగా అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, కర్నూలు జిల్లా ఇన్ ఛార్జ్ జంగంరెడ్డి అంకాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ కొల్లూరు శేషఫణి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, ఉపాధ్యక్షులు వంశీ, మహిళా మోర్చా అమరావతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి రెడ్డి



స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# భక్తులతో కిటికిటలాడిన పంపనూరు ఆలయం

**ఆత్మకూరు, నవంబర్ 4:**
మండల పరిధిలోని పంపనూరు ఆలయంలో కార్తీకమాసం రెండవ మంగళవారం సంధర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దర్శనం కోసం అశేష జనవాహిని తరలివచ్చింది.ఈ భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదర్శన చేసే భక్తులతోనూ, అభిషేకాలు, యాగమంటపంలో జరిగిన దోష నివారణ పూజలలోనూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మెయిన్ రోడ్డు నుంచి ఆలయం వరకు వీధిలో ఎక్కడ చూసినా భక్తుల సందడే. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి విగ్రహాలకు పాలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. అభిషేకం తదుపరి బంగారు కవచ అలంకరణ, ఆకుపూజ ,అర్చన అనంతరం మహానైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. గర్భాలయాలకు బయట శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి కళ్యాణం, పల్లకి సేవ నిర్వహించారు. రాహు కాలం పూజలో భాగంగా యాగమంటపంలో కుజదోష, కాలసర్పదోష, సర్పదోష నివారణ కొరకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హెూమము" నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన సమితి వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పల్లకి సేవ నిర్వహిస్తున్న దృశ్యం. పంపనూరు ఆలయంలో హెూమాలు నిర్వహిస్తున్న దృశ్యం

# కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించండి

**యాడికి, నవంబర్ 4 :**
పెద్దపప్పూరు ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం కుష్టువ్యాధి నిర్మూలలపై డాక్టర్ ప్రీతి, డిపిఎంఓ రామచంద్ర ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. లెప్రసి కేసు డిటెక్షన్ క్యాంపైన్ కార్యక్రమంపై రీ ఓరేంటేషన్ ట్రైనింగ్ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి నిర్మూలనపై పరీక్షించి అవగాహన కలిగించాలని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుండి 30 వ తేదీ వరకు నిర్వహించస్తామన్నారు. జీరో కేసులు తీసుకొని రావడం, జీరో వికాలంగత్వం, జీరో స్టిగ్మా అనగా లెప్రసి వ్యాధి గ్రాస్తులపై వివక్ష చూపకుండా ఉండాలన్నారు. చర్మం పై స్పర్శ లేని రాగి రంగు మచ్చలుఉన్న వారిని ఇంటింటికి తిరిగి గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని డాక్టర్ ప్రీతీ, డిపిఎమ్ఓ రామచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్ర, ప్రమీల, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, నోడల్ పర్సన్ శర్మస్ వలి, బీవీ లక్ష్మమ్మ సూపర్ వైజర్, ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డిపియంఓ రామచంద్ర



సమావేశంలో పాల్గొన్న ఆశాలు

# రబీ సీజన్ ముగిసినా రైతులకు అందని పప్పుశెనగ

**రైతుల ఆవేదన..**

**యాడికి, నవంబర్ 4 :**
యాడికి మండలంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న పప్పు శెనగలు రైతులకు సకాలంలో అందలేదని, ఇప్పుడు ఇచ్చినా ఫలితం లేదని ఇప్పటికే రైతులు ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద కొనుకోలు చేసి పంట వేసుకున్నారని భోగాలకట్ట గ్రామానికి చెందిన రైతు లక్ష్మి రెడ్డి, ఇతర రైతులు తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం పప్పు శెనగలు అక్టోబర్ 15 నుండి పంపిణీ చేసేదన్నారు. రబీ సీజన్ అయిపోతున్నా ఇప్పటికీ ప్రభుత్వం పప్పు శెనగలు అందివ్వక పోవడం విచారకరమన్నారు. దీంతో ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద రూ.5.700 నుండి రూ. 5.800 వరకు కొనుగోలు చేసి పంట వేశారని, మొలకలు కూడా వచ్చాయన్నారు. ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో కింటాలుకు రూ.5.850తో ఆర్బికే ద్వారా పంపిణీకి పప్పు శెనగలు తరలించింది. మంగళవారం విత్తనాలు ఆర్బికేకి వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి రవి సీజన్, ఖరీఫ్ సీజన్ ఎప్పుడో తెలియడం లేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు సమనయంతో సకాలంలో శెనగలు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.



పప్పుశెనగ పంట మొలకెత్తిన దృశ్యం



మొలకెత్తిన పప్పుశెనగను చూపిస్తున్న రైతు లక్ష్మిరెడ్డి

# ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా అంజన్ ప్రసాద్



**గుత్తి, నవంబర్ 4:**
గుత్తి పట్టణానికి చెందిన అంజన్ ప్రసాద్ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణ రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంజన్ ప్రసాద్ గత కొన్ని సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్‌లో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులుగా అంజన్ ప్రసాద్ సేవలను గుర్తించిన రాష్ట్ర అధ్యక్షులు ఆయనను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమిస్తూ ఉత్తరుడు జారీ చేశారు. తన నియమకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసినట్లు అంజన్ ప్రసాద్ తెలియజేశారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా పనిచేసే జాతి ప్రయోజనాలను కాపాడడానికి పనిచేస్తానని అన్నారు.



ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి

# రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**తాడిపత్రి, నవంబర్ 4:**
తాడిపత్రి -పుట్లూరు రైల్వే గేట్ మధ్యలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి(55) ౦లు క్రింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మురుదేశ్వర్ సూపర్ ఫాస్ట్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు.



ఎమ్మెల్యేకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

# సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకి ఆహ్వానం

**తాడిపత్రి, నవంబర్ 4:**
శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డిని శ్రీ సత్య సాయి బాబా భక్త మండలి సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను తాడిపత్రి సత్యసాయి బాబా భక్త మండలి సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి బాబా భక్త మండలి సభ్యులు గంగాధర్, శ్రీనివాసులు, శ్రీధర్, సుధాకర్, వెంకటరామి రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఫిబ్రవరిలో ఐజేయూ ప్లీనరీ

**విజయవాడ, నవంబర్ 4:**
ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) ప్లీనరీ సమావేశాలను ఫిబ్రవరి నెల మొదటివారంలో విజయవాడలో నిర్వహించాలని ఏపీయూడబ్ల్యూజే నిర్ణయించింది. యూనియన్ అధ్యక్షులు ఐ. వి. సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో యూనియన్ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐ.జే.యూ. జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ ,ఆంధ్రప్రదేశ్, చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలతోపాటు, ఐజేయూ ప్లీనరీ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా యూనియన్ అగ్రనేత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఐజేయూ ఆవిర్భావం తర్వాత 1992లో రెండో ప్లీనరీ విజయవాడలో ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఐజేయూ 11వ ప్లీనరీని నిర్వహించే అవకాశం మరోసారి ఏపియుడబ్ల్యూజే కు వచ్చిందని, ప్లీనరీని విజయవాడలోనే నిర్వహించాలని యూనియన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

# విశేష పుష్పాలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

**తాడిపత్రి, నవంబర్ 4:**
శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో 14వ రోజున మంగళవారం విశేష పుష్పాలంకరణతో భక్తులకు శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనభాగ్యం కల్పించారు. శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి అత్యంత భక్తిశ్రద్ధల నడుమ పంచామృత అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు గావించారు.



విశేష పుష్పాలంకరణలో
శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి



బత్తలపల్లి పోలీస్ స్టేషన్

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

### ఏడుగురి అరెస్ట్..

**బత్తలపల్లి, నవంబర్ 4:** మండల పరిధిలోని ఈదుల ముష్టూరు గ్రామంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ?సోమవారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు.?అరెస్ట్ చేసిన వారి వద్ద నుండి పోలీసులు రూ. 4,070 నగదును స్వాధీనం చేసుకున్నారు.అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


దర్గా కమిటీ అధ్యక్షులు మృతికి సంతాపం తెలుపుతున్న డికె బాబు

## దర్గా కమిటీ అధ్యక్షుని మృతికి సంతాపం

**తలుపుల , నవంబర్ 4:** మండల కేంద్రంలోని ప్రముఖ శర్పదిన్ బాబా దర్గా కమిటీ అధ్యక్షులు అముదు మియా(90) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైకాపా మండల కన్వీనర్ డీకే బాబు మంగళవారం కుమ్మరి పేట లోని అందుమియా ఇంటికి వెళ్లి ఆయన మృతి కి సంతాపం ప్రకటించారు. కొన్ని దశాబ్దాల పాటు అందూనీయ దర్గా కమిటీ అధ్యక్షులుగా ఉండి దర్గాను అభివృద్ధి చేశారన్నారు. ఆయన తో పాటు ప్రభు, ప్రభాకర రెడ్డి, మహమ్మద్ రఫీ, మౌలా, మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

## 7 నుండి శ్రీ రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**బత్తలపల్లి, నవంబర్ 4 :** మండలంలోని అనంతసాగరం గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. శ్రీ రామలింగేశ్వర స్వామితో పాటు పార్వతీదేవి, వినాయక, కుమారస్వామి, నంది, ధ్వజ స్తంభం మూల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.ఈ ఉత్సవాలు నవంబర్ 7వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభమై నవంబర్ 9వ తేదీ ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఆదివారం ఉదయం 9:30 నిమిషాల నుంచి 10:30 నిమిషాల లోపు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. అదేవిధంగా కలశ స్థాపన, గణపతి ప్రార్థన, సాయంత్రం అంకుర్పాణం, మహా గణపతి హెూమం వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు మొదలవుతాయి.రెండో రోజు శనివారం నవగ్రహ హెూమం, శ్రీరామలింగేశ్వర స్వామి మూల మంత్ర హెూమం, రుద్రసోహాకార హెూమం, మహస్నపనము, తదుపరి గ్రామోత్సవం నిర్వహించబడుతుంది.నవంబర్ 9వ తేదీన శుభముహుర్తంలో విగ్రహ ప్రతిష్ఠ అనంతరం జ్వాలా తోరణం, పూర్ణాహుతి, మంగళహారతి, ఆశీర్వచనం కార్యక్రమాలు ఉంటాయి.గ్రామ ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు భక్తాదులందరూ ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలలో పాల్గొని శ్రీ రామలింగేశ్వర స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## వీరాంజనేయ స్వామిని దర్శించుకొన్న పాండురంగప్ప

**రొళ్ల, నవంబర్ 4 :** మండల పరిధిలోని టీడీపల్లి గ్రామం లో నూతనంగా ప్రతిష్టించిన వీరాంజనేయ స్వామి ని సోమవారం రాత్రి రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వి ఎం పాండురంగప్ప దర్శించుకొన్నారు. సోమవారం వేలాది మంది భక్తులు నడుమ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శ్రీ శ్రీ చిదానంద స్వామీజీ రాష్ట్ర కుంచటిగా ఒక్కలిగా సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మండల్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం రవికుమార్,సిద్దే గౌడ్ యువ నాయకుడు రుద్ర కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు. వారికి గ్రామస్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.


వేదికల్లో పాల్గొన్న రాష్ట్ర వక్కలిగా కన్వీనర్ వీఎం పాండురంగప్ప

# హేమావతి దేవాలయం అభివృద్ధికి కృషి

### జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ..

**అమరాపురం, నవంబర్ 4:** పురాతన చరిత్ర కలిగిన హేమావతి ఎంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. హేమావతి గ్రామంలోని టూరిజం అతిథి గృహం లో హేమావతి పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో మంగళవారం జిల్లా, నియోజకవర్గ ,మండల స్థాయి ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాకృతిలో భక్తులకు దర్శనమిస్తున్న పురాతన దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీటివసతి, రెస్ట్ రూమ్‌ల ఏర్పాటు తదితర మౌలిక వసతుల కల్పించడానికి కృషి చేస్తామన్నారు. రథోత్సవం సందర్భంగా రోడ్డు ఇరుకున ఉండడంతో భక్తుల సౌకర్యార్థం రోడ్డు వెడల్పు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతు పనులు చేయడానికి కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో దేవాలయం ఉండడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి దీనికి సంబంధించిన నివేదికను పంపి మరమ్మతుకు కృషి చేయడానికి ప్రయత్నం చేస్తామని కలెక్టర్ తెలిపారు. హేమావతిని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయడానికి సోలార్ విలేజ్ గాఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ అభివృద్ధికి కావలసిన నివేదికలను ఎంపీడీవో రామారావు, ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ మును నాయక్ నివేదిక అందజేశారు.

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,హేమావతి పంచాయతీ దత్తత తీసుకోవడం ద్వారా అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలోనిప్రధాన సమస్యలను మాజీ సర్పంచ్ హనుమంతరాయప్ప, మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఓంకార్ స్వామీలు వివరిస్తూ శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి పథకం తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్లు నియామకం, 108 వాహనం మంజూరు, చెక్ డ్యాం ల మరమ్మతు, హేమావతి నుండి శివరంనకు రోడ్డు ఏర్పాటు, అదేవిధంగా బస్సు సౌకర్యంతదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే హేమావతి గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం హేమావతి పంచాయతీ నాయకులు కలెక్టర్ మరియు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీలకు భారీ గజమాలతో సన్మానం చేశారు.


జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలకి గజమాలతో స్వాగతం పలికిన హేమావతి ప్రజలు నాయకులు.

ఈ కార్యక్రమంలో హెచ్ ఎల్ ఎస్ ఏ ఈ ఈ స్వరూప్ కుమార్, ఆర్డిఓ ఆనంద్ కుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ మునునాయక్,వెలుగు పీడీ నరసయ్య, తహసిల్దార్ లక్ష్మీనరసింహం, ఎంపీడీవో రామారావు, వ్యవసాయ అధికారి మంజునాథ్ , ఏవో ఆరాధ్య, విద్యుత్ డి ఈ,విద్యుత్ ఏఈ సిద్దేశ్వర, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ హరీష్, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, డాక్టర్లు భార్గవ్, అంబరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి,మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండోఅధ్యక్షుడు గణేష్,ప్రధాన కార్యదర్శి నాగరాజ్,, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి ,కన్వీనర్ శివరుద్రప్ప, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప, ఆలయ కమిటీ కరేగౌడ్, ,క్లస్టర్ కన్వీనర్లు నవీన్ కుమార్, కృష్ణమూర్తి, చెన్నప్ప, సీనియర్ నాయకులు కుమారస్వామి, తిప్పజ్జ, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఓంకార్ స్వామి, తిమ్మయ్య, డీలర్ గౌడ, యువ నాయకుడు మంజునాథ్, పార్లమెంట్ తెలుగు యువతఉపాధ్యక్షుడు రఘు, రమేష్,ఎఫ్ ఎ గౌడరంగప్ప, డీలర్ల సంఘ అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

# కేజీబీవీ పాఠశాల సందర్శన

### ఎంఇఓ శ్రీధర్..

**రొళ్ల, నవంబర్ 4 :** మండల పరిధిలోని అవినకుంట గ్రామం లో వెలసిన కేజీబీవీ పాఠశాలను ఎం ఇ ఓ శ్రీధర్ పరిశీలించారు.పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు జరుగుతున్నా " విజయపథం " టెస్ట్ ల గ్రేడింగ్, మనబడి కార్యక్రమంలో మిగులు ఉన్న స్టాక్ లను తనిఖీ చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుల కరదీపికలను పరిశీలించారు. విద్యార్థులు అందరు క్వశ్చన్ పేపర్లోని ప్రశ్నలు బాగా చదివి జవాబులు వ్రాయాలి.ఎస్ సి ఈ ఆర్ టి వారు పంపిన మాదిరి ప్రశ్న పత్రాలు ప్రాక్టీస్ చేయాలని తెలిపారు. విద్యార్థినీలు ఇప్పటి నుండీ బాగా చదివితే అందరు మంచి మార్కులుతో పాస్ అవుతారని పాఠశాల సిబ్బందికి, విద్యార్థులుకు సూచించారు. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు గల విద్యార్థినీలకు చదవడం, రాయడం రావాలి, గణితం లో చతుర్విధ ప్రక్రియలు ఖచ్చితంగా నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు.


ఉపాధ్యాయులకు దిశనిర్దశం చేస్తున్న ఎంఇఓ శ్రీధర్.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్


# వక్కమార్కెట్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్..

**అమరాపురం, నవంబర్ 4:** మండల పరిధిలో హల్కూర్ పంచాయితీ పరిధిలో కాచికుంట సమీపంలో ఏర్పాటు చేయనున్న వక్క మార్కెట్‌కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ వక్క మార్కెట్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, రైతులు ప్రజలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు తీసుకొనవలసిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. . వక్క మార్కెట్ అవసరమని దీంతో అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం ఉదుగురు గ్రామ రైతు ఇంటి ఆవరణలో వలచిన వక్కను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు ప్రకాష్ వక్క ఏ విధంగా తయారు చేస్తారో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఆర్డిఓ ఆనంద్ కుమార్, మార్కెటింగ్ ఎల్. ఎన్. మూర్తి, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ డైరెక్టర్ దాదా పీర్ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయ కుమార్, మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బి.ఎస్. గురుమూర్తి, డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తాసిల్దార్ లక్ష్మీ నరసింహ , ఎంపీడీవో రామారావు, దేశం పార్టీ సీనియర్ నాయకుడు మారుతి ప్రసాద్, క్లస్టర్ కో కన్వీనర్ నవీన్ కుమార్, మంజు తారక్, మాజీ కన్వీనర్స్ శివ రుద్రప్ప బి.ఎస్, నాగరాజు , రఘు,నాగోనపల్లి మంజునాథ్ డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు హనుమంతు, అధికారులు సర్వేలు పాల్గొన్నారు.


వక్క మార్కెట్ స్థల పరిశీలన చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, అధికారులు


వక్క మార్కెట్ స్థలపరిశీలన చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



ఒలచిన వక్కను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.
వక్క మార్కెట్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

# రాష్ట్ర స్థాయి క్రీడలకు ముదిగుబ్బ విద్యార్థినులు

### జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ..

**ముదిగుబ్బ, నవంబర్ 4:** ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జిఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీలలో మెరుగైన ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అనంతపురం ఆర్‌డీటీ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ అండర్-17 పోటీల్లో విద్యార్థినులు యశ్వంత్ కుమారి, వైష్ణవి, మహిత తమ క్రీడా నైపుణ్యాన్ని చాటారు. వీరి ప్రతిభను గుర్తించిన ఎంపిక కమిటీ రాష్ట్ర స్థాయి పోటీలకు వీరిని ఎంపిక చేసింది. ఈనెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎస్జిఎఫ్ సెక్రటరీలు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఎంఈఓ రమణప్ప, పిడి రేఖ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబరచి దేశస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల కమిటీ, సిబ్బంది, సహ విద్యార్థులు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

# రాగే లింగనహళ్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**అగళి, నవంబర్ 4 :** మండలంలోని రాగేలింగన హళ్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని బొమ్మసాన పల్లి, హనుమనపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతులతో ఈ రబీ సీజన్లో వేసుకునే వివిధ రకాల పంటలలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు,వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించినటువంటి వివిధ రకాల పథకాల గురించి ఈ పంట నమోదు గురించి,నానో యూరియా,నానో డి ఏ పి ప్రాముఖ్యత,జిప్సమ్, దాని ఉపయోగాలు దాన్ని ఎలా వాడాలో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది, వేరుశనగ,రాగి,మేత జొన్న, పూల పంటలను రైతులతో కలిసి సందర్శించి ఆ పంటలలో పాటించవలసిన నూతన యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ పద్ధతులను చాలా క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు,ప్రజా ప్రతినిధులు,రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.


సస్యరక్షణ పద్ధతులు, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఏఓ నాగరాజు


సస్యరక్షణ పద్ధతులు, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఏఓ నాగరాజు

# కోటిసంతకాల సేకరణ

### గ్రామ స్థాయి సమావేశాల్లో తెదేపాను ఎండగతాం..
### వైసీపీ కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి..

**తనకల్లు, నవంబర్ 4:** కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తనకల్లు మండలం బాలసముద్రం పంచాయతీలోని కొక్కంటి క్రాస్‌లో పార్టీ మండల కన్వీనర్ బబ్బు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కదిరి సమన్వయ కర్త బిఎస్ మఖ్బుల్ అహ్మద్ ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లోని పేద విద్యార్థుల కడుపు కొట్టేందుకు మెడికల్ కాలేజి ప్రవేటి కరణ అంశం లేవనెత్తిన కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజలే తిప్పికొట్టే పరిస్థితి అతి దగ్గరలో ఉందన్నారు. తెదేపా కల్లబుల్లి మాట లు నమ్మేందుకు ప్రజల అమాయకుల కాదన్నారు వైఖరిని ప్రజలే గట్టిగా బుద్ధి చెప్పి రాబోయే ఎన్నికల్లో గద్దెదింపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొండక మార్ల ముస్తఫా, మాజీ సర్పంచ్ పూల శంకర్, ఎంపీటీసీ హిమదర్ రెడ్డి,లక్ష్మీపతి, కె ఆయుబ్, ఇక్బాల్, అబ్దుల్ రసూల్,పూల రవీంద్ర, ముబారక్,టి చంద్ర పాల్గొన్నారు.


కోటి సంతకాలు సేకరిస్తున్న వైకాపా నేతలు


కోటి సంతకాలు సేకరిస్తున్న వైకాపా నేతలు

## ఘనంగా జన్మదిన వేడుకలు

**రొళ్ల, నవంబర్ 4 :** మండల పరిధిలోని శివబాల యోగి నగర్‌లో హులికుంట గొల్లహట్టి గ్రామానికి చెందిన జేసీబీ యజమాని క్రిష్ణప్ప కు గ్రామస్థులు అందరూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త టి.రంగస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.


పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రంగస్వామి


కేక్ కట్ చేస్తున్న క్రిష్ణప్ప

# నిబంధనలు పాటించకపోతే చర్యలు

## తహసీల్దార్ గీతా ప్రియదర్శిని

**పెద్దకడబూరు, నవంబర్ 4 :**
ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని రేషన్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా 26 నుంచి నెలాఖరు వరకు వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా, పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను సకాలంలో ఎందుకు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. రెండు రోజుల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని లేనిపక్షంలో రేషన్ కోటా తగ్గితే తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రెండు రోజుల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల రేషన్ డీలర్లు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వీఆర్వోలు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.


రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న

# రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

## రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు అంజినేయ ..

**పెద్దకడబూరు, నవంబర్ 4 :**
రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు అంజినేయ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దకడబూరు గ్రామంలోని సీపీఐ కార్యాలయంలో నవంబర్ 19, 20 తేదీలలో ఆదోనిలో రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగే రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో పత్తి పంటను రాష్ట్రంలో 4,48,210 హెక్టార్లలో సాగు చేశారన్నారు. కర్నూలు జిల్లాలోనే 2,25, 969 హెక్టార్లలో పత్తి పంటను సాగుచేశారని తెలిపారు. రాష్ట్రంలో పండే పంటలో సగం పంట ఇక్కడే సాగుచేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పత్తి సాగు చేసిన రైతాంగం ప్రారంభదినాల్లో వర్షాభావ స్థితిని, అనంతరం అధిక వర్షాలకు గులాబి రంగు పురుగు, తెల్ల దోమలను ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అతలాకుతలం చేసి 2-3 నెలల నుంచి కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాల వల్ల భూమిలో తేమ శాతం ఎక్కువై పైరు పూత పింజ ఎర్రబడి కుళ్లిపోవడం జరిగిందన్నారు. కాస్తాకూస్తో పంటలు పండితే మార్కెట్లో గిట్టుబాటు ధర లేక రైతులు పంటలను పొలాల్లోనే వదిలేసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పత్తి ఎకరాకు 2,3 క్వింటాళ్లు కూడా రాక రైతు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నవంబరు 19,20 తేదీలలో ఆదోనిలో జరుగు పత్తి రైతు సమ్మేళనానికి జిల్లాలోని అన్ని ప్రాంతాలు, పత్తి పండించే అన్ని జిల్లాల రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుడ్డన్న, అంజినయ్య, మొట్రు వీరేష్, రాముడు, సుభాన్, బాబు, భీమన్న, తిక్కన్న, నాగన్న, చిన్నోడు, ఈరన్న, పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు


# బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాబురావు

**పెద్దకడబూరు, నవంబర్ 4 :**
బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన బాబురావు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ బాబురావు మాట్లాడుతూ తనను బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.



# నేడు శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో చండీహోమం

**పెద్దకడబూరు, నవంబర్ 4 :**
పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని నేడు అనగా బుధవారం చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ పెద్దలు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 7 గంటలకు గణపతికి, శివుడికి, అమ్మవారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. 10 గంటలకు చండీహోమం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం లక్ష దీప అలంకరణ, జ్వాలాతోరణం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున గ్రామ ప్రజలు చండీహోమం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.


పెద్దకడబూరులో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి

# శ్రీశైలంలో కార్తీక పౌర్ణమికి భారీ ఏర్పాట్లు

## కార్తీక పౌర్ణమి కోటి దీపోత్సవం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం.. కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ..

**శ్రీశైలం, నవంబర్ 4:**
శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి, కోటిదీపోత్సవ ఏర్పాట్లపై కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు సమీక్షించారు. అన్ని శాఖల అధిపతులు, అన్ని విభాగాల పర్యవేక్షకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యనిర్వహణ అధికారి మాట్లాడుతూ కార్తీకపౌర్ణమినాడు భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ఇప్పటికే నిర్ణయించిన ప్రణాళికలను అనుసరించి దర్శన క్యూలైన్లను నిర్వహించాలన్నారు. క్యూలైన్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్లలో తొక్కిసలాట, తోపులాటలు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అందరూ కూడా సమాచార వినిమయ లోపం లేకుండా సమిష్టిగా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. దేవిధంగా వాహనాల క్రమబద్ధీకరణకు కూడా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యభద్రతా అధికారిని అదేశించారు. ఈ విషయమై స్థానిక పోలీసుశాఖ వారి పూర్తి సహాయ సహకారాలు పొందాలన్నారు. అదేవిధంగా కార్తీకపౌర్ణమిరోజు భక్తులు పుణ్యస్నానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. పాతాళగంగ ఘాట్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు ప్రసాదాల విక్రయకేంద్రం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసాదాలు అందజేత, అన్నప్రసాదాలవితరణను త్వరగా ప్రారంభించాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు. కార్తీకపౌర్ణమినాటి జ్వాలాతోరణోత్సవంలో భద్రతాపరంగా అవసరమైన ముందస్తు జాగ్రత్తలన్నీ తీసుకోవాలన్నారు. జ్వాలాతోరణోత్సవం సమయంలో రెండెంచల బ్యారికేడింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని జ్వాలా తోరణోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎల్.ఈ.డీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్తీక పౌర్ణమినాడు జరిగే లక్షదీపోత్సవం - పుష్కరిణి హారతి కార్యక్రమాలలో కూడా అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. 14న జరుగనున్న కోటిదీపోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ ఏర్పాట్లన్నీ కూడా ప్రణాళికబద్ధంగా ఉండాలన్నారు. కాగా దీపోత్సవానికి అవసరమైన పూజా సామాగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందన్నారు. కాగా కోటిదీపోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు 12వ తేదీ సాయంకాలం 5.00 గంటల వరకు దేవస్థాన ం కార్యాలయంలోని ప్రజాసంబంధాల విభాగంలో పేర్లను నమోదు చేసుకోవచ్చు అని కార్య నిర్వహణ అధికారి తెలిపారు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కార్యనిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఈఓఎం శ్రీనివాసరావు. అధికారులు

# రబీ పంటలకు సాగునీరు అందించాలి

## మార్చి నెలాఖరు వరకు ఎల్లెల్సీకి సాగునీరు విడుదల చేయాలి.. కలెక్టర్‌కు వినతిపత్రం..

**పెద్దకడబూరు, నవంబర్ 4 :**
ఎల్లెల్సీ పరిధిలోని రైతాంగానికి రబీకి సాగునీరు అందించాలని ఎమ్మిగనూరులో ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎల్లెల్సీ ఛైర్మన్ టిప్పు సుల్తాన్, డీసీ ఛైర్మన్ నరవ రమాకాంతరెడ్డి టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లెల్సీ కాలువకు మార్చి నెలాఖరు వరకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. తద్వారా రైతులకు రబీలో సాగు చేసే పంటలకు సాగునీరు అందుతుందన్నారు. ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసిన పంటలను అధిక వర్షాల మూలంగా పూర్తిగా దెబ్బతిని పోయాయని, దీంతో రైతులు అపారంగా నష్టపోయారన్నారు. చేసేది లేక గ్రామాల్లో ఉపాధి కరువై రైతులతోపాటు కూలీలు వలసబాట పెట్టారని తెలిపారు. ఎల్లెల్సీకి మార్చి ఆఖరి వరకు ఎల్లెల్సీకి నీరు విడుదల చేస్తే రైతులు రబీ పంటలకు సాగు చేసుకుంటారని, లేదంటే రైతు పరిస్థితి దారుణంగా తయారవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తుంగభద్ర ప్రాజెక్టు వద్ద గేట్లు మరమ్మతులను జూన్ నెలలో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో రైతులు ఉన్నారు.


రబీ పంటలకు సాగునీరు అందించాలని కలెక్టర్ డాక్టర్ సిరికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న డీసీ ఛైర్మన్ నరవ రమాకాంతరెడ్డి

# జిల్లా స్థాయికి ఎంపికయిన కెజిబివి విద్యార్థినులు

## ఆయకట్టుకున్న వెల్నెస్ కార్నర్ ..

**కోసిగి, నవంబర్ 4 :**
కోసిగిలోని కె.జి.బి.వి. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన స్కూల్ లెవల్ స్కిల్ కాంపిటిషన్ లో "బ్యూటీ అండ్ వెల్నెస్ ట్రేడ్" విభాగంలో విద్యార్థినులు తమ ప్రతిభకనపరచి అందరిని ఆకట్టుకున్న రెండు గ్రూపుల విద్యార్థినీలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ఎస్ ఓ షేక్ షభనా అజ్మీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ జానకి మరియు ఎస్.ఓ షేక్ షబానా అజ్మీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు వెల్ నెస్ కార్నర్ హెల్త్ అండ్ హైజీన్,అనే థీమ్పై అద్భుతమైన మోడల్స్ తయారు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు పలు మోడల్లను రూపొందించినట్లు . వాటిలో బ్రష్లను శుభ్రంగా నిల్వ ఉంచుకోవడం మేకప్ బ్రష్లను శుభ్రంగా ఉంచుకునే విధానం.గురించి మేకప్ ప్రోడెక్ట్ బాక్స్ , చేసిన ఉత్పత్తి బాక్స్ ద్వారా వస్తువులను సురక్షితంగా నిల్వ చేయడం చూపించినట్లు ఆమె తెలిపారు. హెర్బల్ ఫెస్ ప్యాక్ ,ముల్తాని మట్టి, రోజ్ వాటర్ వంటి సహజ పదార్థాలతో చర్మాన్ని ఎలా సంరక్షించు కోవాలో వివరించి నట్లు ఆమె తెలిపారు. అలాగే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, యోగా, మానసిక ఆరోగ్యం, ఫస్ట్ ఎయిడ్, మెనస్ట్రుయల్ హైజీన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారన్నారు. ఈ బ్యూటీ అండ్ వెల్నెస్ ట్రేడ్ ద్వారా విద్యార్థినులు భవిష్యత్తులో బ్యూటీ థెరపిస్టులు, మేకప్ ఆర్టిస్టులు, హెల్త్ కౌన్సిలర్స్ లాంటి రంగాలలో కెరీర్ అవకాశాలను వెతుకోవచ్చునన్నారు ఈ ట్రేడ్ వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పరిశుభ్రత అలవాటు పెరుగుతున్నాయని ఆమె తెలిపారు. అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండు గ్రూపులకు బహుమతులు అందజేయడం ద్వారా వారి కృషిని సత్కరించారన్నారు. ఇంకా ఇందులో ఆరోగ్యం అంటే వ్యాధి రాకపోవడం మాత్రమే కాదని, శారీరక మానసిక సమతుల్యత కలిగిన జీవన విధానం అనే సందేశంతో కార్యక్రమం ముగించినట్లు తెలిపారు.


జిల్లా స్థాయికి ఎంపికైన కోసిగి కెజిబివి విద్యార్థినిలు


# విశాఖపట్నంలో భూకంపం

**విశాఖపట్నం, నవంబర్ 4:**
విశాఖపట్నం నగరాన్ని స్వల్ప భూకంపం వణికించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున 4.24 నిమిషాలకు భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొంతమంది నివాస ప్రాంతాల వారు భూకంపం అనిపించడంతో ఇళ్ల బయటకు పరుగులు తీశారు. ముఖ్యంగా మురలీనగర్, గాజువాక, మాధురవాడ, %వీఎూ% కాలనీ, గోపాలపట్నం ప్రాంతాల్లో తేలికపాటి వణుకులు నమోదయ్యాయని స్థానికులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.0 చుట్టుపక్కలగా నమోదై ఉండవచ్చని భూకంపశాఖ అంచనా వేస్తోంది.

# దేవమ్మ, పద్దమ్మ అమ్మవార్ల నూతన ఆలయాలు ప్రారంభం

## హాజరైన టిడిపి నాయకులు..

**కౌతాళం, నవంబర్ 4:**
మండలంలోని కాత్రికి గ్రామ దేవమ్మ, పద్దమ్మ అమ్మవార్ల నూతన ఆలయలు ప్రారంభోత్సవ కార్యక్రమం వేడుకగా జరిగింది. పూజల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకుని గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లూరు అడివప్ప గౌడ్ , కౌతాళం వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అల్లూరి వెంకటపతి రాజు , తెలుగుదేశం పార్టీ కౌతాళం టౌన్ అధ్యక్షులు డాక్టర్ నీలి రాజానంద్ , నరసప్ప, తెలుగు యువత నాయకులు గొట్టయ్య తదితరులు పాల్గొన్నారు. నాయకులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయించారు. శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రన్న , మాజీ ఎంపీటీసీ మారెప్ప , సీనియర్ నాయకులు, ఈ,ఈరన్న గౌడ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


తెలుగుదేశం పార్టీ నాయకులను సన్మానిస్తున్న కాత్రికి గ్రామస్తులు


తెలుగుదేశం పార్టీ నాయకులను సన్మానిస్తున్న కాత్రికి గ్రామస్తులు

# ప్రతి రోజు నాణ్యమైన భోజనం ప్రజలకు అందించాలి

## అన్న క్యాంటీన్ పరిశీలన.. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి..

**ఆదోని, నవంబర్ 4:**
అన్న క్యాంటీన్‌లలో ప్రతి రోజు నాణ్యతతో కూడిన భోజనం ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ ల ద్వారా అందచేస్తున్న భోజనం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ తెలిపారు.. అక్కడే భోజనం చేస్తున్న ఎమ్మిగనూరు చిన్న కమేలి విధికి చెందిన వలి బాషా, మహబూబ్ బాషా లతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు ఇక్కడికి వచ్చి భోజనం చేస్తారా?? భోజనం రుచిగా ఉంటుందా?? సరిపోయేంత భోజనం పెడుతున్నారా?? క్యాంటీన్ ను శుభ్రంగా ఉంచుతారా?? అనే విషయాలను కలెక్టర్ వారిని ఆరా తీశారు?? భోజనం రుచిగా పెడుతున్నారని, సరిపోయినంత పెడుతున్నారని, క్యాంటీన్ శుభ్రంగా ఉంచుతున్నారని, ప్రతిరోజు ఇక్కడే భోజనం చేస్తామని చాలా బాగుంటుందని కలెక్టర్ కి తెలిపారు.
అనంతరం కలెక్టర్ నేరుగా భోజనం వండిస్తున్న ప్రదేశం వద్దకి వెళ్ళి అన్నం, పప్పు, సాంబార్, క్రర్రీ లను పరిశీలిస్తూ అక్కడే ఉన్న అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతూ వచ్చిన ప్రజలకు సరిపోయేంత భోజనం పెడుతున్నారా?? మధ్యాహ్నం భోజనం ఏ సమయానికి ఇక్కడికి వస్తుంది?? ప్రతి రోజు ఎంతమంది భోజనం చేస్తున్నారు?? కర్రీ సరిపోతుందా?? సమస్యలు ఏమైనా ఉన్నాయా?? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు... అన్న క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నారని ఇదే విధంగా కొనసాగించాలని కలెక్టర్ అన్న క్యాంటీన్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి


భోజనం చేస్తున్న గ్రామీణ ప్రజలతో నాణ్యతను గురించి అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ సిరి

## విద్యార్థులు ఏపీజీబీ బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేయించుకోవాలి

*సచివాలయం- 1 సోషల్ వెల్ఫేర్ అధికారి నాగరాజు..*

**ముద్దనూరు, నవంబర్ 4**
మండల పరిధిలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లో అకౌంట్ ఉన్నట్లయితే వెంటనే అప్డేట్ చేయించుకోవాలని సచివాలయం1 సోషల్ వెల్ఫేర్ అధికారి నాగరాజు ఓ ప్రకటనలు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, నాలుగుజిల్లాలు, ఒకే తరహాలో అనుసంధానంతో ఐఎఫ్సి కోడ్ మారిందని, ఆ బ్యాంకులో అకౌంట్ ఉన్న విద్యార్థులు విద్యకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు పొందాలంటేసంబంధిత బ్యాంకులు మేనేజర్ ను సంప్రదించి వారి అకౌంట్‌ను వెరిఫికేషన్ చేసుకొని అప్డేట్ చేసుకోవాలని, అలాగే సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు వారికి తెలియజేయాలని ఆయన ప్రకటన పేర్కొన్నారు.



## భారత మహిళా క్రికెట్ జట్టుకు మంచూరు అభినందనలు

**బద్వేల్, నవంబర్ 4:**
ప్రపంచ మహిళా క్రికెట్ వరల్డ్ కప్ -2025 పోటీల్లో ఫైనల్ మ్యాచ్లో తలపడిన సౌత్ ఆఫ్రికాతో అద్భుత నైపుణ్యం ప్రదర్శించి విజయం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టుకు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం బద్వేల్ పట్టణం ఎన్జీవో కాలనీ మంచూరు నూతన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత మహిళా క్రికెట్ జట్టుకు ఇది సువర్ణ అధ్యాయమని, ప్రతి భారతీయుడు గర్వపడేలా ఆడి వన్డే వరల్డ్ కప్ గెలవడం ద్వారా మన మహిళా క్రికెటర్లు ప్రపంచ చరిత్ర సృష్టించారని డీసీసీబీ చైర్మన్ వ్యాఖ్యానించారు. టీం కెప్టెన్ హార్మన్ ప్రీత్ కౌర్, ఫైనల్ లో జట్టు విజయంలో కీలకపాత్ర వహించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్న షెఫాలి వర్మ, టోర్నమెంటు మొత్తంగా అద్భుత ప్రతిభకనపరచి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గా నిలిచిన దీప్తి శర్మ, సెమీ ఫైనల్లో సూపర్ సెంచరీతో జట్టును ఫైనల్ కు చేర్చిన జెమీమా రోడ్రిగ్స్ కు మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లండన్‌లో మంత్రి కందుల దుర్గేష్ పర్యటన

**అమరావతి, నవంబర్ 4 :**
లండన్ వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)-2025 సమావేశంలో మంత్రి దుర్గేష్ పాల్గొననున్నారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ను లండన్ డిప్యూటీ హై కమిషనర్, దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులతో కలిసి ప్రారంభించనన్నారు. రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా కూచిపూడి నృత్యంతో ఏపీ పర్యాటక స్టాల్ ను అక్కడి ప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తారు. ఇంటర్నేషనల్ టూర్ ఆపరేటర్లు, ఇంటర్నేషనల్ హోటల్స్ ప్రతినిధులు, మైస్ ఇన్వెస్టర్లు, ఇంటర్నేషనల్ ట్రావెల్ మాగజైన్స్, ఇంటర్నేషనల్ మీడియా బ్లాగర్స్ తదితర 20 మంది ప్రతినిధులతో విడివిడిగా చర్చిస్తారు. అంతర్జాతీయ ప్రతినిధులతో రాష్ట్రంలో పర్యాటక పెట్టుబడుల అవకాశాలపై, టూరిజం ప్యాకేజీలపై వివరిస్తారు. ఏపీ పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.


## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీ కొట్టిన ఐచర్ వాహనం


**చెన్నై కొత్తపల్లి , నవంబర్ 4 :**
శ్రీ సత్యసాయి జిల్లా చెన్నై కొత్తపల్లి మండలం దామాజి పల్లి వద్ద ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐచర్ వాహనాన్ని ఢీకొంది. రాత్రి రెండు గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళు తున్న జబ్బార్ ట్రావెల్స్ బస్సు చెన్నే కొత్తపల్లి సమీపంలోని క్రాస్ వద్ద ఐచర్ వాహనానికి పొంది ఈ ప్రమాదంలో సురక్ష అనే 32 ఏళ్ల మహిళ మృతి చెందింది. హైదరాబాద్ కు వెళుతున్న వినీత్, సురక్ష తన మూడేళ్ల కూతురుతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్నారు. వీరిలో సురక్ష మృతి చెందగా భర్త వినీత్ మూడేళ్ల నిధి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి బస్సు అతివేగం కారణంగా తెలుస్తోంది. అయితే బస్సు డ్రైవర్ మాత్రం ఐచర్ వాహనం జాతీయ రహదారిలో యూటర్న్ చేసుకుంటున్న సమయంలో ఇది జరిగిందని చెప్తున్నారు. ప్రమాదం అనంతరం గాయపడ్డ వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ప్రయాణికులను వివిధ వాహనాల్లో స్వస్థలాలకు చేర్చారు.

# పతాక స్థాయిలో వైసిపి వర్గపోరు!

### కోటి సంతకాల సేకరణకు విశ్వనాథ్ రెడ్డి వర్గం డుమ్మా.. బద్వేల్ రాజకీయాల్లో కలకలం..

**బద్వేల్, నవంబర్ 4:**
బద్వేల్ నియోజకవర్గ రాజకీయాల్లో మళ్లీ ఉత్కంఠ రేగుతుంది వైసీపీలో అంతర్గత పోరు తో విభేదాలు తారాస్థాయికి చేరినట్టు సమాచారం. 2001వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో రాజకీయాల్లో ప్రవేశించిన నల్లేరు విశ్వనాథ రెడ్డి, వైయస్ఆర్ మరణం నుంచి ఈ రోజుటి వరకు పార్టీ పట్ల అచంచల విశ్వాసంతో ఉన్నారు. తాలూకా పార్టీ నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుల వల్ల రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటూ కూడా ఆయన పార్టీ పట్ల నిబద్ధతతో కట్టుబడి పనిచేస్తూ ఉన్నారు. పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుంటుందనే నమ్మకంతో క్షేత్రస్థాయిలో కృషి కొనసాగిస్తున్నారు.





2024 ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికలో విశ్వనాథ రెడ్డి సూచించిన అభ్యర్థికి ప్రాధాన్యత ఇచ్చే సందర్భంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీమతి సుధమ్మ "ఒక్కసారి నాకు అవకాశం ఇవ్వండి" అని అధిష్ఠానాన్ని కోరగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంగీకరించి డా. సుధమ్మను బద్వేల్ అభ్యర్థిగా ప్రకటించారు. అదే సమయంలో నల్లేరు విశ్వనాథ రెడ్డిని బద్వేల్ వైసీపీ అదనపు సమన్వయకర్తగా నియమించిన విషయం అందరికీ తెలిసిందే, అధిష్ఠానం సూచనల మేరకు విశ్వనాథ రెడ్డి వలసలను అడ్డుకొని, ప్రచారం బలోపేతం చేసి, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయిల్లో పార్టీ విజయానికి విశష కృషి చేశారు,

అయితే 2024 సాధారణ ఎన్నికలలో పార్టీ ఓటమి తర్వాత, బద్వేల్ రాజకీయాలపై పునర్మూల్యాంకనం ప్రారంభమైంది. విశ్వనాథ రెడ్డిని పలుమార్లు అధిష్ఠానం పిలిపించి నాయకత్వ సమస్యపై చర్చించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అక్టోబర్ 8, 2025న పార్టీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి తో విజయవాడ లో విశ్వనాథ రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం అక్టోబర్ 30న జరిగిన మరో కీలక భేటీలో సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, లు ఇద్దరూ కీలకనేత లైన ఎమ్మెల్సీ %ఙజ% గోవింద రెడ్డి, విశ్వనాథ రెడ్డి లతో వేరు వేరు గా సుదీర్ఘ చర్చలు జరిపారు. అయితే ఆ చర్చలు తేలికపడకపోవడంతో విషయం మరికొద్ది రోజులు వాయిదా పడింది. గతంలో "జగన్ మోహన్ రెడ్డి , అవినాష్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారనే నమ్మకంతో విశ్వనాథ్ రెడ్డి ఉన్నారు. ఇదిలా ఉండగా, డి.సి. గోవింద రెడ్డి వర్గం బాధ్యతలు తమకే అప్పగించబడ్డాయని సంబరాలు జరుపుకుంటూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాం" అని వారి వర్గం ప్రచారం చేస్తోంది. ఈ పరిణామాల వల్ల విశ్వనాథ రెడ్డి వర్గము లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అతి త్వరలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ రాజకీయ దిశపై చర్చించాలన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. వైసీపీలో జరుగుతున్న ఈ వర్గపోరు భవిష్యత్తులో ఏ రూపం దాల్చుతుందో వేచి చూడాల్సిందే.

# అధిక దిగుబడికి రైతులను ప్రోత్సహించడమే లక్ష్యం

### కడప ఏరువాక కోఆర్డినేటర్ కృష్ణప్రియ.. పశు వైద్యాధికారి వాసా శ్రీనివాసరావు.. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి..

**ముద్దనూరు, నవంబర్ 4 :**
మండల పరిధిలోని ఉప్పులూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా ప్రకృతి వ్యవసాయ, పశు వైద్య అధికారులు సంయుక్తంగా వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా డాట్ సెంటర్(ఏరువాక కేంద్రం)కడప కో ఆర్డినేటర్ డాక్టర్ యన్.క్రిష్ణ ప్రియ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపాలి అన్నారు. ఆధునిక పద్దతులను అనుసరించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి అన్నారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం లో



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

మెళకువలు గురించి రైతులకి వివరించారు. ఆయా సీజన్లో పశువులకు వచ్చే జబ్బుల గురించి తెలిపి, వ్యాధి లక్షణాల ను గుర్తు పట్టె విధంగా తెలిపి నివారణ చర్యలను రైతులకి వివరించారు. పాల ఉత్పత్తి పెంచుటకు దోహద పడే విషయలను రైతులతో చర్చించారు. అలాగే మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం గురించి క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పలు పథకాల గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన కంది, సోయా చిక్కుడు పంటలను పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు అందించారు. రసం పీల్చే పురుగుల నివారణ గురించి తగు నివారణ చర్యలు పాటించాలి అన్నారు. లద్దే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2 యమ్ యల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు అవసరం మేరకే, సూచించిన మేరకే క్రిమిసంహారక మందులు వాడుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి గంగయ్య, ఉద్యాన సహాయకుడు టి.ప్రశాంత్ కుమార్, వి.ఏ.యమ్ లిల్లీ గ్రేస్ గ్రామ రైతులు పాల్గొన్నారు

# విశ్వశాంతి మహాయాగంలో పాల్గొన్న కలెక్టర్ సిరి

**ఆదోని, నవంబర్ 4:**
కృష్ణ కాలచక్రం 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లోని యజ్ఞంలో 4వ రోజు ఘనంగా నిర్వహిస్తున్న హనుమాత్ సహిత సుబ్రహ్మణ్య హోమాలు చండీ హోమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గారు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.







ఎమ్మిగనూరులో జరుగుతున్న కృష్ణ కాలచక్రం 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గారు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి



గెలుపొందిన విద్యార్థులకు బహుమానం ప్రధానం చేస్తున్న ఐసిడిఎస్ సిడిపిఓ భాగ్యలక్ష్మి , పాఠశాల హెచ్‌ఎం, టీచర్లు

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సీడీపీవో భాగ్యలక్ష్మి..

**ప్రొద్దుటూరు, నవంబర్ 4 :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ గర్ల్స్ ఉర్దూ హై స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని సీడీపీవో భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ 18 వ వార్డులోని హైస్కూల్లో ఈ పోటీలను నిర్వహించామని ఆమె తెలిపారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు. తస్లీమ్. సనలకు ఐసిడిఎస్ సిడిపిఓ భాగ్యలక్ష్మి విద్యార్థులకు బహుమానం ప్రధానం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఏర్పాటు చేసిందని విద్యార్థులు బాగా కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. విద్యతో పాటు జనరల్ నాలెడ్జ్ కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులు గర్వపడేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, స్కూల్ టీచర్లు, విద్యార్థులు, అర్బన్ సూపర్వైజర్ జమీలా, అంగన్వాడి కార్యకర్తలు దస్తగిరమ్మ, జ్యోతి, ఆదిలక్ష్మి, శారద, గౌసియా తదితరులు పాల్గొన్నారు.



వేములూరు గ్రామంలో పర్యటించిన ఎంపి అవినాష్ రెడ్డి

## నూతన వధూవరులకు ఆశీర్వాదం

ఎంపీ అవినాష్ రెడ్డి..

**అట్లూరు, నవంబర్ 4:**
మండలంలోని వేమలూరు గ్రామానికి చెందిన అట్లూరు మాజీ ఎంపీపీ ముడమాల బాల ముని రెడ్డి, అట్లూరుమండల పార్టీ కన్వీనర్ ముడమాల ప్రభాకర్ రెడ్డి అన్న ముడుమాల రామిరెడ్డి కుమార్తె వివాహ మల్లు పెళ్లి రిసెప్షన్ వేడుకలకు వేములూరు గ్రామానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించిన కడప ఎంపీ అవినాష్ రెడ్డి , మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష ,కడప మాజీ మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధ తో పాటు నియోజకవర్గం బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోవిల్ల సూరా రెడ్డి , రామ సుబ్బారెడ్డి, జిల్లా వాలంటరీ వింగ్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, డి ఎల్ డి ఏ చైర్మన్ రెండా మాధవరెడ్డి మాజీ యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి, పెద్దపోలి రెడ్డి, రామసుబ్బారెడ్డి మన్యం గంగిరెడ్డి , నాగేశ్వరరావు,గంగిరెడ్డి, చౌటపల్లి రాజారెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి,ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ దస్తగిరి

## ఆన్‌లైన్ మోసాలు, రహదారుల భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సీఐ దస్తగిరి..

**ముద్దనూరు, నవంబర్ 4**
ఆన్‌లైన్ మోసాలలో రహదారుల భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ దస్తగిరి పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి లోని పులివెందుల రహదారిలో వాహన చోదకులకు ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన చోదకుడు రహదారుల నియమాలను పాటిస్తూ క్షేమంగా వారి కుటుంబ సభ్యులను చేరుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదు అన్నారు ప్రస్తుతం సైబర్ దేశంలో సైబర్ నేరాల సంఖ్య దినదినానికి ఎక్కువ అవుతున్నాయని ఫోన్ ద్వారా పలానా బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఓటిపి అడిగినా సమాచారం పూర్తిగా తెలుసుకున్నాకనే నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే ఫోన్ ద్వారా మిమ్మల్ని ప్రలోభ పెట్టిన, బ్లాక్ మెలింగ్ తరహాలో చేసిన వెంటనే సంబంధిత పోలీసులకు గాని సైబర్ క్రైమ్ అధికారులకు గాని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు,ప్రజలు ఉన్నారు.

## గండికోట వెనుకజలాల గ్రామాల సందర్శన

*కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎంఎల్‌ఏ ఆదినారాయణరెడ్డి.. నియోజకవర్గపు టిడిపి ఇన్ ఛార్జ్ భూపేష్ రెడ్డి..*

**ముద్దనూరు, నవంబర్ 4**
గత కొన్ని సంవత్సరాలుగా గండికోట వెనకజలాలతో గ్రామాలను చుట్టుముట్టి అవస్థలు పడుతున్నాయని సంబంధిత జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులకు శెట్టివారిపల్లె, కోడిగానపల్లె, ప్రజలు విన్నవించుకోవడంతో, బుధవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గపు టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి, తదితరులు సందర్శించి గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, కేంద్ర, రాష్ట్ర, భారీ నీటిపాగుల శాఖ మంత్రులకు, అధికారులకు నివేదిక పంపించి మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ , మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.కోడి గాండ్లపల్లె, శెట్టివారిపల్లె, గ్రామ ప్రజలు ఉన్నారు.



గ్రామాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి

## ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అనంత కౌంటర్

# అవినీతి బురదలో కూరుకుపోయి విమర్శలా..

**అనంతపురం, నవంబర్ 4 :**
అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివాదాలు, అవినీతి బురదలో కూరుకుపోయి దాన్ని అందరికీ అంటించాలని చూస్తున్నారని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో రైతు సమస్యలపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల దగ్గుపాటి ప్రసాద్ చేసిన ఆరోపణలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అనంత సమాధానం ఇచ్చారు. "నేను సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉన్నానని, పదవులు అనుభవించానని ఆయనే (దగ్గుపాటి) అంటున్నాడు. కానీ, ఇన్నేళ్లలో ఇలా వివాదాలు, అవినీతి బురదలో దిగిన వాణ్ణి నేను చూడలేదు. అతడు బురదలో ఇరుక్కుపోయి దాన్ని అందరికీ పూస్తే సరిపోతుందనే పద్ధతిలో వెళు_న్నాడు. జిల్లాలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, భూఆక్రమణలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, భూహక్కుదారులు ప్రశ్నిస్తే బెదిరింపులు జరుగుతున్నాయి. ఇదే అనంతపురంలో కృష్ణ ఇంగ్లిష్‌మీడియం స్కూల్ యజమానిని వదల్లేదు. బుడగజంగాల వాళ్లను వదల్లేదు. సాయినగర్‌లో మైనార్టీ మహిళను ఎలా దూషించారో తెలుసు. చివరకు చంద్రబాబు బావమరిది, హరికృష్ణ కుమారుడైన ఎన్టీఆర్‌ను, ఆయన తల్లిని ఎలా దూషించారో అందరికీ తెలుసు. ప్రజలే వీటి గురించి చర్చించుకుంటున్నారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో కూడా వచ్చింది. ఇదే కాదు అనంతపురం శివారులోని పాపంపేటలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. చివరకు దొంగ సంతకాలు చేశారని చెబుతున్నారు. ఇలాంటి ఘటనలపై ప్రశ్నిస్తే నాపై విమర్శలు చేస్తున్నారు. ఎలాగోలా మమ్మల్ని బెదిరించి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా మా గళం నొక్కుతామంటే భయపడేవాణ్ణి కాదు. జిల్లాలో చాలా మందిని చూశాం. ఎవరు అప్రజాస్వామ్య పద్ధతిలో ఏది చేసినా ప్రశ్నిస్తా..! నా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పోరాటం చేస్తా.. ఇలాంటి వాళ్లకు బెదరను. మా కుటుంబం చరిత్ర తెరచిన పుస్తకం. మాది ఉమ్మడి కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములం కలిసే ఉన్నామన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించేందుకు కృషి

### మండలంపై మంత్రి కేశవ్ ప్రత్యేక దృష్టి..
### గ్రామాల్లో కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందాం..
### టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్, సీనియర్ నాయకులు రాధాకృష్ణ..

**బెళుగుప్ప, నవంబర్ 4:**
బెళుగుప్ప మండలంలోని ఏ గ్రామంలోనైనా ఇల్లు లేని అర్హులు ఎవరైనా ఉంటే అలాంటి వారిని గుర్తించి, వారికి ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్, సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీఎ కార్యాలయంలో నాయకులు వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి పయ్యావుల కేశవ్ బెళుగుప్ప మండలం పై ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందులో భాగంగానే గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, సంక్షేమ పథకాలను అందించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యంగా ప్రభుత్వము ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని గ్రామాలలోని నాయకులు అర్హులై ఉండి ఇళ్ళు లేని వారిని గుర్తించి ఇల్లు నిర్మించుకునే విధంగా కృషి చేద్దామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లను కూడా త్వరితగతిన ఇచ్చేందుకు మండల తహసిల్దార్ అనిల్ కుమార్ తో చర్చించి, ఒక్కొక్క గ్రామానికి సర్వేరు, వీఆర్వో తో పాటు వచ్చి పరిశీలించే విధంగా ను, ఒక ప్రొఫార్మాను తీయించామని దాని ద్వారా పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సులభతరం అవుతుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని నాయకులు గ్రామాల్లో ఏ సమస్యలైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే,వాటిని మంత్రి కేశవ్ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. మంత్రి కేశవ్ ఎప్పుడైనా గ్రామాల్లోకి వస్తే ఇక సమస్యలు, ఇల్లు లేని వారు ఉండకూడదని, ఆ విధంగా నాయకులు గ్రామాల్లో కష్టపడి ప్రజా సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో ప్రజలకు అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో గ్రామాల్లో సిసి రోడ్లు, నూతన హాస్పిటల్, బెళుగుప్ప, శీర్పి చెరువులకు నీళ్లు, ఇతర సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు అందించారన్నారు. కావున గ్రామాల్లోని నాయకులు ప్రజలకు సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు తీర్చే విధంగా మండల నాయకుల సహకారంతో ముందుకు వెళ్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్ సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, ఎంపీపీ పెద్దన్న, ఆవులెన్న సర్పంచ్ రామ్మోహన్ చౌదరి, తెలుగు యువత జిల్లా నాయకులు విరపాపల్లి రాధాకృష్ణ, నక్కలపల్లి వెంకటరామిరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్, సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ

## పార్టీ మనుగడ కోసమే వైసిపి కోటి సంతకాల కార్యక్రమం

### పి ఫోర్ పై అవగాహన లేని నాయకులు.. టీడీపీ నాయకులు..

**బెళుగుప్ప, నవంబర్ 4:**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే, అది చూసి ఉరువలేని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాయకులు తమ పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసమే ప్రజల్లోకి వచ్చి కోటి సంతకాల కార్యక్రమం చేస్తున్నారని మండలం టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం బెళుగుప్ప టీడీపీ కార్యాలయంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్, సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు కూటమినేతల సహకారంతో 16 నెలల పాలన కాలంలోనే రాజధాని నిర్మాణాలతో పాటు, పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించి, సంక్షేమంతో ప్రజాధరణను పొందుతుంటే, అది చూసి ఓర్వలేకనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాయకులు ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలన్న తపనతో, పార్టీ మనుగడ కోసమైనా జనాల్లోకి వెళ్లాలని పి ఫోర్ పై అవగాహన లేకుండా కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. సీఎం చంద్రబాబు పి ఫోర్ పై తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన మేధావులు సైతం మెచ్చుకుంటుంటే, అవగాహన లేని మతిభ్రమించిన వైఎస్ఆర్సిపి నాయకులు మాత్రం కనీస అవగాహన లేకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని ముందు చూపుతో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు అన్నారు. 2047 కి రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే వివిధ దేశాలకు చెందిన ఎన్నో పెద్ద పెద్ద కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో దేశ ప్రధానిగా ఉన్న అటల్ బిహారీ వాజ్ పాయ్ కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి పథంలో నడిపించారో, అదే తరహాలో నేడు కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి ప్రయత్నంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలందరూ పాలనను మెచ్చుకుంటుంటే, ప్రతిపక్ష హోదా లేని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం అవగాహన లేని కార్యక్రమాలతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్, సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, ఎంపీపీ పెద్దన్న,ఆవులెన్న సర్పంచ్ రామ్మోహన్ చౌదరి, తెలుగు యువత జిల్లా నాయకులు విరిపాపల్లి రాధాకృష్ణ, నక్కలపల్లి వెంకటరామిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల కన్వీనర్ నరసాపురం ప్రసాద్, సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ

## నేడు శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

### శ్రీ మరకతలింగ రామేశ్వర స్వామికి పంచామృత రుద్రాభిషేకం..
### కార్తీక దీపోత్సవం, జ్వాలా తోరణం...
### శ్రీ గౌరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువు తీర్చుట..

**బెళుగుప్ప, నవంబర్ 4:**
బెళుగుప్పలో కొలువైన మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో నేడు బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని దేవాలయ సేవా సభ్యుల సహకారంతో మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామికి పంచామృత రుద్రాభిషేకం, భక్తుల నడుమ కార్తీకదీపోత్సవం, జ్వాల తోరణం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆలయ ప్రాంగణంలో సరి గౌరీ దేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో కొలువు తీర్చి మహిళలచే ప్రత్యేక హారతులు,పూజలు నిర్వహిస్తారు. బుధవారం కార్తీక పౌర్ణమి ని పురస్కరించుకొని ఉదయం కలశ పూజ, గణపతి పూజ, శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు, అనంతరం శ్రీ గౌరీ దేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ కట్ట పైన కొలువు తీర్చుట. సాయంత్రం భక్తుల మధ్య కార్తీక దీపోత్సవం, జ్వాలా తోరణం, శ్రీ గౌరీ దేవి అమ్మవారికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు 13వ తేదీన నిమజ్జన కార్యక్రమం వరకు ప్రతిరోజు చక్కర హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సేవ సభ్యులు పేర్కొన్నారు.


బెళుగుప్ప లో వెలసిన మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామి.కార్తీక పౌర్ణమి వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయం. శ్రీ రామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కళ్యాణకట్ట వద్ద కొలువు తీర్చనున్న శ్రీ గౌరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహం

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మనీశ్వర్ సాయి, హరి సాత్విక్

**బెళుగుప్ప, నవంబర్ 4:**
బెళుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.మనీశ్వర్ సాయి, బి హరి సాత్విక్ అనే విద్యార్థులు కళ్యాణదుర్గం డివిజనల్ కబడ్డీ పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వెంకటప్రసాద్, పిడి గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెచ్ఎం వెంకటప్రసాద్, పిడి గోపాల్ రెడ్డి లు మాట్లాడుతూ ఆవుల దట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కళ్యాణదుర్గం డివిజనల్ కబడ్డీ పోటీలలో అండర్ 17 కబడ్డీ పోటీలలో 10 వ తరగతి విద్యార్థి మనీశ్వర్ సాయి, అండర్ 14 కబడ్డీ పోటీలలో 8 వ తరగతి విద్యార్థి, హరి సాత్విక్ లు అత్యంత ప్రతిభ ను కనబరిచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ క్రీడాకారులు నేడు అనంతపురం ఆర్ డి టి స్టేడియంలో జరగబోయే జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో కళ్యాణదుర్గం డివిజనల్ నుంచి పాల్గొంటారన్నారు. అనంతరం మణీశ్వర్ సాయి, హరి సాత్విక్ లను డివైఈవో మల్లారెడ్డి, ఎంఈఓ 2 హరికృష్ణ, హెచ్ఎం వెంకటప్రసాద్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రుద్రయ్య, పిడి గోపాల్ రెడ్డి మెడల్స్ ను అందించి అభినందించారు. జిల్లాస్థాయిలో కూడా వీరు మంచి ప్రతిభ కనబరిచే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మనీశ్వర్ సాయి, హరి సాత్విక్ క్రీడాకారులను మెడల్స్ వేసి అభినందిస్తున్న హెచ్ఎం వెంకటప్రసాద్, పిడి గోపాల్ రెడ్డి


చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో మిషన్ పరిశీలిస్తున్న దృశ్యం . ఎరువులు తయారు వాటిని పరిశీలిస్తున్న సీఈవో శివశంకర్.

## చెత్త నుండి సంపద తయారు కేంద్రాలపరిశీలన

### సీఈఓ. శివశంకర్..

**యాడికి, నవంబర్ 4 :**
యాడికి మండలంలోని యాడికి. రాయలచెరువు. వేమలపాడు. ఎన్ చిక్కేపల్లి గ్రామాలలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సీఈఓ శివశంకర్ పరిశీలించారు. మంగళవారం చిక్కేపల్లి గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో పరిశీలించి పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కలిగించారు. అలా తరపు యాడికి లోని పంచాయతీ కార్యాలయంలో పరిశీలించి చందన రోడ్ లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో తడి చెత్త పొడి చెత్త వేరు వేసిన వాటిని మేస్త్రి కి రోజు వేసే చెత్త చూపి అన్నారు ఆయన పాత చెత్త కుప్ప చూపీయడంతో ఆయనపై ఆగ్రహ వ్యక్తం చేశారు. చెత్త నుండి తయారు అయినా ఎరువులను పరిశీలించి ఎందుకు వీటికి ఎందుకు అమ్మలేదని పంచాయితీ సిబ్బందిని తెలిపారు రైతు లు కొనడానికి ఎవరు రాలేదని తెలపడంతో వెంటనే ఏపీఓ కు కొనుకోలు చేసేటట్లు ఫీల్ అసిస్టెంట్లకు గ్రామాలలో రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో పాత చెత్త రిక్షాలు మూల పడడంతో వాటిని మరమ్మత్తులు చేసుకోవాలని లేకుంటే గుజిరికి వెయ్యాలని సిబ్బందికి సీఈవో శివశంకర్ తెలిపారు. ఖాళీగా ఉన్న చెత్త తొట్టలో తడి చెత్త వెయ్యాలని మీరు ఇష్టం వచ్చినట్టు ఎక్కడపడితే అక్కడ వేసే చర్యలు తప్పవని హెచ్చరించారు చెత్త సంపద తయారీ కేంద్రంలో ఆకుకూరలు కూరకాయలు పూల చెట్లతో వేశారు అయితే అక్కడక్కడ కంపచెట్లు ఉండడంతో మేస్త్రీకి పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ ఆ చెట్టు ఏమి చెట్టు అని అడిగారు కంప చెట్టు అనగానే ఎందుకు తొలగించలేదని పరిశుభ్రంగా ఉంచాలని వాటిని తొలగించి ఆస్థానంలో చెట్లను పెంచాలన్నారు గ్రామంలో ఎక్కడ కూడా చెత్త కనిపించకూడదని తిరిగి వారంలో వచ్చిన సమయంలో ఎక్కడ చెత్త కలిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వేమలపాడు చెత్త సంపద తయారు కేంద్ర పరిశీలించి ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి పంచాయతీ సిబ్బంది ఇంటికి వచ్చి చెత్త సేకరిస్తున్నారా పరిశుభ్రం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయలచెరువు చెత్త నుండి సంపద తయారు కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శిలకు సిబ్బందికి గ్రామంలో పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో శివశంకర్ తో పాటు ఎంపీడీవో వీర రాజు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర. కార్యదర్శిలు. అరుణ్ కుమార్. మహేశ్వర్ రెడ్డి. సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీవో వీర రాజుతో పంచాయతీ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీఈవో శివశంకర్


మూలపడిన రిక్షాలను పరిశీలిస్తున్న సీఈవో శివశంకర్


వేపాలపాడు గ్రామంలో ఎస్సీ కాలనీలో ప్రజలను అడిగి తెలుసుకుంటున్న సీఈవో శివశంకర్

## బెళుగుప్పను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి

### తహసిల్దార్‌కు వినతిపత్రం... ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు...

**బెళుగుప్ప, నవంబర్ 4:**
బెళుగుప్ప మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులను, కూలీలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడుతోపాటు మండల కమిటీ నాయకులు అశోక్ తో కలసి మండలం తహసిల్దార్ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బిహెచ్ రాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ లో సాగు చేసిన వేరుశనగ ఇతర పంటలు సకాలంలో వర్షాలు రాకపోవడంతో పూర్తిగా దెబ్బ తిన్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాల ప్రకటనలో కరువు మండలంగా జాబితాలో చేర్చకపోవడం జిల్లాలో ఉన్న రైతులు కూలీలకు తీవ్ర నష్టం చేయడమేనని, ఖరీఫ్ లో సాగు చేసిన పంటలకు జూన్ జూలైలో కురిసే వర్షం పంటలకు కీలకం,కానీ జూన్ లో 61మి. మీటర్లు వర్షం కురవాల్సి ఉండగా 21.7 మి.మీటర్లు తక్కువ కురిసింది జూలైలో 64.3మి. మీటర్లుకు గాను 34.7మి. మీటర్లు పడింది 46శాతం తక్కువగా పడినది ఖరీఫ్ లో పంటలు సకాలంలో వర్షాలు రాక విత్తనం వేయాలో వద్దు అని రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పంటలు సాగు చేశారు.జులై ఆఖరిలో ఆగస్టు లో కురిసిన వర్షాలకు పంటలు సాగు చేసిన పంట దిగుబడులు పూర్తిగా తగ్గినాయి, అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు తెచ్చిన అప్పులకు కూడా రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి లో అన్నదాతలు ఉన్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తొలగించిన పంటలు కూడా వేరుశనగ, మొక్కజొన్న ఇతర పంటలు తడిసి తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. పెద్ద ఎత్తున పంటలు నష్టపోయిన ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో మండలాన్ని చేర్చకపోవడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమేనన్నారు. కావున ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ప్రజా ప్రతినిధులు స్పందించి జిల్లాలో ఉన్న అన్ని మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చి పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ప్రకటించి జిల్లాలో ఉన్న రైతు కూలీలను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం మండల కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.


తహసిల్దార్ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు, మండల నాయకులు



మాట్లాడుతున్న రాష్ట్ర కురువ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.కె మల్లికార్జున

## కనకదాసు విగ్రహ ప్రతిష్టకు భారీగా తరలిరండి

**కనేకల్, నవంబర్ 4:**
ఈనెల 8 తేదీ కళ్యాణదుర్గంలో జరిగే కనకదాసు జయంతి, విగ్రహ ప్రతిష్టకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానం వద్ద ఉన్న కురువ కమ్యూనిటీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కనకదాసు జయంతిని నిర్వహించడం అర్హనీయమన్నారు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో నీ కురువ కులస్తులు ఈ జయంతి, విగ్రహ ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం పట్టణంలో హిందూపురం రోడ్డు బైపాస్ సర్కిల్ నందు 9 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో న విశిష్ట అతిథిగా ఐటీ, విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ బాబు చేతులమీదుగా శ్రీ భక్త కనకదాసు విగ్రహం ఆవిష్కరణ జరగడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు ఆలూరు చిక్కన్న,నాగరాజు నరసింహులు,తిప్పే స్వామి, ఆదినారాయణ, నరేష్, తిమ్మరాజు,ఆంజనేయులు వన్నారెడ్డిలతో పాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ బాలిక దినోత్సవ సందర్భంగా మాట్లాడుతున్న సిడిపిఓ నాగమణి

## బాలికలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలి

### సిడిపిఓ నాగమణి..

**కనేకల్ నంబర్ 4:**
బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో దూసుకుపోవాలని సిడిపిఓ నాగమణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ మాసోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ నాగమణి మాట్లాడుతూ బాలిక దినోత్సవ మాసోస్తవ అవగాహన ప్రధాన లక్ష్యం బాలికల హక్కులు, ఆరోగ్యం,విద్య భద్రత, మరియు సమాన అవకాశాలపై సమాజంలో అవగాహన కొరకు అన్నారు. ఈ కార్యక్రమాలు మండలంలోని ప్రతి గ్రామ సచివాలయంలో నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు బాలికలలో అభివృద్ధి ఆత్మవిశ్వాసం పెంపు మరియు సామాజిక సమానత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. బాలికలు ప్రతి రంగంలో ముందంజలో ఉండేలా వారిని ప్రోత్సహించడం మనందరి బాధ్యత అన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలు ఫోక్స్ చట్టం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాలిక శక్తి దేశశక్తి అనే నినాదంతో సమాజం ప్రతి బాలికకు గౌరవం రక్షణ విద్యను అందించడానికి కట్టుబడి ఉండాలని అన్నారు. ప్రతి తల్లిదండ్రి బాలికను సమానంగా ప్రేమించి చదివించి స్వావలంబన దిశగా తీసుకు వెళ్లడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పాటు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్లు ఈశ్వరమ్మ గీత మరియు మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వాష్ రూమ్‌లో నీళ్లు లేక ఇబ్బందులు

**ఉదయగిరి(వరికుంటపాడు) నవంబర్ 4:**
వరికుంటపాడు మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామ పంచాయతీలోని సచివాలయ భవనంలో అనేక రోజులుగా వాటర్ పైప్ లైన్ మోటర్ మరమ్మతులకు గురవడంతో వాష్ రూమ్‌లో నీటి సౌకర్యం లేక సచివాలయ ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే వివిధ పనుల మీద కార్యాలయానికి వస్తున్న ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో మూత్రశాలకు వెళ్ళవలసిన పరిస్థితుల్లో నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్థానిక పాలకులు చొరవ తీసుకొని మోటర్ మరమ్మతులు చేపట్టి ప్రజలకు స్థానిక ఉద్యోగస్తులకు వాష్ రూమ్ లో నేలకు ఇబ్బంది లేకుండా చేయాలని స్థానిక ప్రజలు కోరుచున్నారు.



తూర్పు రొంపిదొడ్ల గ్రామ సచివాలయం

# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే లక్ష్యం

### శిక్షణ తరగతుల్లో ఎంపిడిఓ తేజోష్ణ ..

**పామిడి, నవంబర్ 4:**
నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యం అని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని జ్యోతి మండల సమైఖ్య నందు మంగళవారం విఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలంటరీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యతను సాదించే దిశగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి గ్రామంలో గుర్తించిన నిరక్షరాస్యులకు వాలంటరీలు క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇస్తూ వారిని సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు.
అనంతరం ఉల్లాస్ అక్షర ఆంధ్ర పుస్తకాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో వయోజన విద్యాశాఖ లక్ష్మీనారాయణ, ఏపిఎం నల్లప్ప, ఏపీఓ ఆదినారాయణమ్మ, సిసిలు, విఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.




ఉల్లాస్ అక్షర ఆంధ్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ తేజోష్ణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపిడిఓ తేజోష్ణ

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### డాక్టర్ సౌందర్య ..

**కనేకల్, నవంబర్ 4:**
వాతావరణ మార్పుల సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాబట్టి ప్రజలు వ్యాధుల పట్ల ప్రమాదం గా ఉండాలని మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్సీ ప్రభుత్వ వైద్యురాలు సౌందర్య తెలిపారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆశ వర్కర్ల డే సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ సౌందర్య మాట్లాడుతూ నవంబర్ నెలలో ఆశా వర్కర్స్ డే నేపథ్యంలో భాగంగా పలు అంశాలపై ఆశ వర్కర్లకు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వాతావరణం లో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు పై గ్రామ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని లేనిపక్షంలో వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని నీటిని వడబోసిన తర్వాతే వేడి చేసి తాగాలని రాత్రి వేళల్లో పడుకునే ముందు దోమతెరలు ఉపయోగించాలన్నారు. తమ ఇల్లు, ఇంటి పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కొద్దిపాటి జ్వరం దగ్గు ఆయాసం వచ్చిన వెంటనే వైద్యుని సంప్రదించాలన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరి, రత్నకుమారి వైద్య సిబ్బంది తిరుపాల్ నాయక్, నరసింహులు మరియు సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సౌందర్య

# చింతలాయి పల్లెలో వైసిపి రచ్చబండ

**యాడికి, నవంబర్ 4 :**
యాడికి మండల పరిధిలోని చింతలయాపల్లి గ్రామంలో మంగళవారం వైసీపీ నాయకులు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి. తాడిపత్రి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ రచ్చబండ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి వైస్సార్సీపీ మండల కన్వీనర్ ఎం. సంజీవరాయుడు మండల సహాయ సెక్రటరీ మారుతీకుమార్ పేరం రామిరెడ్డిబయప రెడ్డి రఘునాథ్ రెడ్డి లక్కు రామిరెడ్డి నాగిరెడ్డిదేవేంద్రారెడ్డి బాలన్న రోసిరెడ్డి మల్లికార్జున వైస్ ఎంపీపీ చెన్నప్ప చెక్క లక్ష్మయ్య జీ శ్రీనివాసులు మధు కంభగిరిరాముడు పప్పుబలానరసింహుడు కొట్టం రామకృష్ణ గంగన్న గురప్ప రామచంద్ర మంజునాథ్ వెంకటశివ ఓబులేసు లక్ష్మీనారాయణ గురప్ప కమలపాడు రంగ. జయుడు భాస్కర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి గణ మధు గురుప్రసాదరెడ్డి వైస్సార్సీపీ కార్య కర్తలు పాల్గొన్నారు ఈశ్వరరెడ్డి బాబు బయపరేరెడ్డి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



చింతలాయిపల్లిలో రచ్చబండ నిర్వహించి పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైయస్ఆర్సీపీ నాయకులు



చింతలాయిపల్లిలో రచ్చబండ నిర్వహించి సంతకాలు సేకరిస్తున్న వైయస్ఆర్సీపీ నాయకులు

# కుష్టువ్యాధి నిర్మూలనపై ఇంటింటి సర్వే నిర్వహించండి

**యాడికి, నవంబర్ 4 :**
కుష్టువ్యాధి నిర్మూలనపై ఇంటింటి సర్వే నిర్వహించాలని డిపిఎమ్ఓ రామచంద్ర అన్నారు. యాడికి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలతో సమావేశంలో నిర్వహించారు. కుష్టువ్యాధి నిర్మూలనపై ఇంటింటి సర్వే చేయాలని వైద్య అధికారులు పరమేశ్వర్. సాయి సుమంత్ రెడ్డి. డిపిఎంవో రామచంద్ర అవగాహన కలిగించారు. జిల్లా లెప్రసీ అండ్ టీవీ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి ఆదేశాల మేరకు యాడికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో డీపీఎమ్ఓ రామచంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆశా కార్యకర్తలు ఉదయము 6 గంటలు నుండి 9 గంటలవరకు సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు వారికి నిర్దేశించిన ఇంటింటికి వెళ్లి లెప్రసీ సర్వే చేయాలన్నారు. లెప్రసపై ప్రజలకు అవగాహన కల్పించచాలన్నారు. గ్రామంలో ఏదైనా లెప్రసీ అనుమానిత కేసులు ఉంటే గ్రామ ఏఎన్ఎం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు.




కుష్టువ్యాధి నిర్మూలన సర్వేపై వివరిస్తున్న డిపిఎమ్ఓ రామచంద్ర

చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని లేదా రాగిరంగు మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు , కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, నొప్పిగా ఉన్న నరములు చేతులు, పాదాలు, నరాల్లో తిమ్మిర్లు కలిగి ఉండడం. అరిచేతులు , కాళ్ళు పాదాలు స్పర్శలేకపోవడం, పొడిబారిపోవడం (చెమట పట్టకపోవడం), చేతులు, పాదాలయందు నొప్పి తెలియని గాయాలు లేదా పుండ్లు కలిగి ఉండడం, చేతివేళ్ళు. కాలివేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, చల్లని లేదా వేడి వస్తువులు గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, మణికట్టు లేక మడమను పైకి లేపలేకపోవటం వంటి లక్షణాలు, కాళ్ళ నుండి చెప్పులు జారిపోవడం ఇలా లక్షణాలున్నవారు పరీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సిహెచ్ ఓ జుబేదా మేల్ అండ్ ఫిమేల్ సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్. శోభకుమారి ఏఎన్ఎంలు ఎం పి హెచ్ ఎ మెయిల్ శరత్ ఎమ్ ఎల్ హెచ్ పి లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆశాలు

# నగరూరులో వైసిపి కోటి సంతకాల సేకరణ

**యాడికి, నవంబర్ 4 :**
యాడికి మండలం నగరూరు గ్రామంలో మంగళవారం వైసీపీ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచనల మేరకు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ"వెన్నపూస వెంకటరామిరెడ్డి. సీనియర్ నాయకులు భోగాతి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం నిర్వహిస్తున్న దానివల్ల కలిగే నష్టాలను పేద విద్యార్థుల పడే కష్టాలను ప్రజలకు వివరిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ నాగేందర్ రెడ్డి, సర్పంచ్ రుక్మానందరెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, హనుమంత రెడ్డి, శివ ప్రహల్లాద్ రెడ్డి , నాగేశ్వర్ రెడ్డి, యోగానంద రెడ్డి, నాని, నారాయణస్వామి, ప్రసాదు, లక్ష్మీనారాయణ, కంబగిరి రెడ్డి, ప్రతాప్, నరేష్, నాగిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వీరారెడ్డి, వెంకట్ నారాయణ, నాగ రంగయ్య, సూరి, చెన్నారెడ్డి, బాలకృష్ణ. లక్ష్మీదేవి, హరిత, రామలక్ష్మి, సులోచన, అచ్చుక్క లలిత, నీలాంబరి, నాగలక్ష్మ తదితరులు పాల్గొన్నారు.



నగరూరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు,



నగరూరులోకోటి సంతకాల పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

## ఆత్మ నిర్భర భారత సంపర్క్ అభియాన్ కార్యక్రమం

**గుత్తి, నవంబర్ 4:**
గుత్తి పట్టణంలోని బిజెపి కార్యాలయంలో భారత సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్చార్జిగా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీ ప్రతాప్ రెడ్డి విచ్చేశారు. గుత్తిపట్టణంలోని బూత్ కమిటీల నిర్వహణ శక్తి కేంద్రాల గురించి త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికల గురించి పట్టణంలోని ముఖ్య నాయకులు కార్యకర్తలతో చర్చించి అదే విధంగా స్వదేశీ వస్తువుల వాడకం గురించి కార్యకర్తలతో చర్చించి దిశ నిర్దేశం చేయడమైనది. ఈ కార్యక్రమం గుత్తి పట్టణ అధ్యక్షులు బీసీ వెంకప్ప ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు తెగ దొడ్డి తిమ్మారెడ్డి గుంతకల్ అసెంబ్లీ కో కన్వీనర్ ఏ రామాంజనేయులు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బావిగడ్డ ఓబులయ్య మాజీ చేనేత సెల్ కన్వీనర్ కే మనోహర్ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ మైనార్టీ నాయకులు వలి భాష విరోసి మనోజ్ హాజీ కరీం ఓబులేసు మహిళా నాయకురాలు కందుల హేమలత గారు మాణిక్యమాచారి మాణిక్యం రామాంజనేయులు పవన్ రమణ గారు రంగరాజు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రెడ్డి గారు గగరెన్ చిన్న ఆంజనేయులు పట్టణ ప్రధాన కార్యదర్శిలు నూరు హసన్, ప్రేమ్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న బిజెపి కార్యకర్తలు

## పురమిత్ర యాప్ పై అవగాహన సదస్సు

**గుత్తి, నవంబర్ 4:**
మునిసిపాలి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయుటకు పురమిత్ర యాప్‌పై అవగాహన, యాప్ వినియోగంపై శ్రీసాయి డిగ్రీ కాలేజిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు రెడ్డి కళాశాల సీఈవో ఏ శ్రీరాములు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు అందించారు. యాప్ డౌన్లోడ్ చేసుకోవడం, మునిసిపల్ ఆఫీసు ద్వారా అందిస్తున్న సేవలు, గ్రీవెన్సు పంపడం, ట్యాక్స్ చెల్లించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం నిషేదామని , ప్లాస్టిక్ వాడకం వలన ప్రాణాంతక సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపక బృందం,సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

## భారీవర్షాలకు కూలిన ఇల్లు

### నిరాశ్రయురాలైన నిరుపేద వృద్ధురాలు నరసమ్మ..

**కోసిగి, నవంబర్ 4:**
మండల కేంద్రమైన కోసిగి లోని సిద్దప్ప పాళ్యం లో ఏడవ వార్డులో నివాసముంటున్న నిరుపేద వృద్ధురాలు మందుల నరసమ్మ ఇల్లు, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా కూలిపోయింది. దీంతో ఆమె నిలువ నీడ కోల్పోయి, తీవ్ర ఇబ్బందులు పడుతూ నిరాశ్రయురాలు అయింది. కట్టుకున్న ఇల్లు కళ్ల ముందే కూలిపోవడంతో నరసమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా, బాధితురాలు నరసమ్మ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు . మందుల నరసమ్మ చాలా నిరుపేదరాలు అని ఆమె పరిస్థితిని పరిగణలోకి తీసుకుని, ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం ద్వారా తక్షణమే కొత్త ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని స్థానికులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరుపేద వృద్ధురాలికి తగిన ఆర్థిక సహాయం అందించి, సురక్షితమైన ఆవాసం కల్పించాలని కోరుతున్నారు.



ఇల్లు కూలి నిరాశ్రయురాలయిన నరసమ్మ

# జగనన్న కాలనీలో పోలీసుల తనిఖీలు

## అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం..
## సీఐ ప్రభాకర్ ..



జగనన్న కాలనీలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**బత్తలపల్లి, నవంబర్ 4:**
బత్తలపల్లిలోని జగనన్న కాలనీలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పర్యవేక్షణలో పోతుకుంట, బత్తలపల్లి ఎస్ఐలు శ్రీనివాసులు, సోమశేఖర్, ట్రైనీ ఎస్ఐ ప్రసన్నతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఈ ఆకస్మిక సోదాల్లో పాల్గొన్నారు.?పోలీసులు కాలనీలోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. సరైన రికార్డులు లేని ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ కాలనీ వాసులతో మాట్లాడారు. మెరుగైన భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి అతిగా ప్రవర్తించేవారి గురించి తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీ వాసులు అందరూ కలిసిమెలిసి, ప్రశాంతంగా జీవించాలని, అనవసర గొడవలు, ఘర్షణలకు పల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు.




కార్డన్ సర్చ్‌లో భాగంగా కాలనీవాసులతో మాట్లాడుతున్న సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్

# కాలువపల్లి హైస్కూల్ తనిఖీ

## డిఇఓ ప్రసాద్ బాబు..

**బెళుగుప్ప, నవంబర్ 4:**
బెళుగుప్ప మండలంలోని కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో విద్య ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో విద్యార్థులను పరిశీలించారు. విద్యార్థులు రాసిన అసెస్మెంట్ పుస్తకాలను కూడా పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించి వారి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ని ఆదేశించారు. అలాగే విద్యార్థుల హాజరు శాతాన్ని ఆన్లైన్లో పరిశీలించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు...



విద్యార్థులు రాసిన అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలిస్తున్న డిఈఓ ప్రసాద్ బాబు



కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రసాద్ బాబు

# మడకశిర ప్రాంతం సస్యశ్యామలం ప్రభుత్వ ధ్యేయం

## జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్..
## ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజు..
## మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

**గుడిబండ, నవంబర్ 4:**
కరువు కాటకాలతో కొట్టుమిట్టడుతున్న మడకశిర ప్రాంతాన్ని సస్యాశ్యామలం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిరెతుర్పి గ్రామ సమీపంలో ఉన్న హంద్రీ నీవా కాలువను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువ పనులు ఇప్పటికే 75 శాతం పూర్తి అయ్యిందని కాలువలో ఉన్న కంప చెట్లు తొలగించడం పూడికతీత పనులు జరుగుతన్నాయని పనులు. పూర్తి అయినా వెంటనే అమరాపురం చెరువుకు కృష్ణ జలాలు వస్తాయాన్నారు. అనంతరం గుడిబండ చెరువు కు నీరు వస్తాయని దీంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి త్రాగు సాగు నీరు కు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు.
ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి మైనర్ ఇరిగేషన్ ఎస్ ఈ స్వరూప్, పెనుకొండ ఆర్ డి ఓ ఆనంద్ కుమార్ తహసీల్దార్ శ్రీధర్, తెదేపా మండల కన్వీనర్ లక్ష్మి నరసప్ప, సింగల్ విండో అధ్యక్షుడు మద్దన్నకుంటప్ప తెదేపా మండల ప్రధాన కార్యదర్శి డి శ్రీనాథ్, నాయకులు చితప్ప, రవి స్వామి, ప్రకాష్, మైనార్టీ నాయకుడు ఏ షబ్బీర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



గుడిబండ హంద్రీ నీవా కాలువను పరిశీలిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్. హాజరైన మహిళలు



ప్రభుత్వ ఆసుపత్రిలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

# అంబులెన్స్‌ల మెయింటెనెన్స్‌కు అనుమతి ఇవ్వండి

## భగత్ సింగ్ ఫౌండేషన్ విన్నపం..

**ఆదోని నవంబర్ 4:**
కర్నూలు జిల్లా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కార్యాలయంలో ఓ అధికారికు వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం ఫౌండేషన్ చైర్మన్ యం.తాహేర్ వలి మాట్లాడుతూ ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రెండు అంబులెన్సులను గతంలో ప్రజలకు సేవలు అందించడం జరిగింది. ప్రస్తుతం అంబులెన్స్ లనుంచి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పేదలకు సేవలు అందించడం లేదు భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ కు ప్రభుత్వం అనుమతి ఇస్తే మెయింటెనెన్స్ చేస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు సేవలు అందించాలని కోరుకుంటున్నాము. వెహికల్ కు సంబంధించిన ఇన్సూరెన్స్ , పాసింగ్ మరియు చిన్న చిన్న రిపేర్లు చేయించుకొని వాహనాలకు ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ భరిస్తుందని అగ్రిమెంట్ రాసి ఇవ్వటానికి మేము సిద్ధముగా ఉన్నాము. ప్రజలకు మరింత సేవలు అందించాలన్న దృక్పథంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇబ్బందులలో ఉన్న పేదలకు మరింత సేవలో అందించడానికి ప్రభుత్వం అనుమతి కొరకు కోరుచున్నాము ఫౌండేషన్ సభ్యులు రామాంజనేయులు, పవన్, అంజి, మోహన్, లక్ష్మన్న, బీరప్ప, గాదిలింగ, మల్లికార్జున, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు ఏరియా హాస్పిటల్ ఆకస్మిక తనిఖీ

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి..

**ఎమ్మిగనూరు, నవంబర్ 4:**
ఎమ్మిగనూరు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ సిరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిల్డ్రన్ ఓపీ, రేడియాలజీ , జనరల్ సర్జరీ, ఎమర్జెన్సీ క్యాజువాలిటీ, ప్రసవానంతర వార్డులను ఆకస్మిక తనిఖీ చేశారు. రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ హాస్పిటల్ లో డాక్టర్ సమయపాలన పాటిస్తున్నారా, డబ్బులు అడుగుతున్నారా అని బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎప్పటికప్పుడు హాస్పిటల్లో శుభ్రపరచుకోవాలని ముఖ్యంగా టాయిలెట్స్ శుభ్రం చేసుకోవాలన్నారు.



ఎమ్మిగనూరు ఆసుపత్రిలో నీటి కుళాయిలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి



ఎమ్మిగనూరు ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి



# ఆత్మ నిర్భర్ భారత్ స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ

## బిజెపి నాయకులు..

**అగళి, నవంబర్ 4 :**
మండలంలోని అన్ని గ్రామాల్లో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మ నిర్భర్ భారత్ స్టికర్లతోపాటు కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్లు బిజెపి నాయకులు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ పిలుపుల మేరకు మండల ప్రవాస కార్యక్రమాన్ని చేపట్టామని,ఇంటింటికి వెళ్లి ప్రజలను అవగాహన పరుస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు. అలాంటి పార్టీలో పనిచేయడం మనందరి అదృష్టంగా భావించాలని వారు అన్నారు. భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే బలమైన పునాది అని అన్నారు. మండలం లో ప్రతి పోలింగ్ బూత్ కమిటీలు ,శక్తి కేంద్రాలు అదేవిధంగా వివిధ మోర్చాల కమిటీ లు పూర్తి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. భారతీయ జనతా పార్టీ విలువలు, సిద్ధాంతాలు కలిగిన పార్టీ అని తెలిపారు. బిజెపి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారం చేపట్టి తరువాత ఈ దేశం లో ఉన్నటువంటి అనేక రకాల సమస్యల ను పరిష్కరించారని అన్నారు. స్వదేశీ పిలుపు తో ఆత్మ నిర్భర భారత్ ద్వారా రాబోయే ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేసి స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమానికి మాజీ అసెంబ్లీ కన్వీనర్ ఈరచిక్కప్ప, మండల ఇంచార్జ్ బసవరాజు, కన్వీనర్ విక్టోరియా రాణి, దొడ్డరంగెగౌడ్ సీనియర్ నాయకులు అశోక్,దేవరాజ్, గంగాధర్, మంజునాథ్, మహేష్, సీనియర్ నాయకులు నాగేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



స్టిక్కర్లను అతికిస్తున్నబిజెపి మండల అధ్యక్షురాలు విక్టోరియా




కరపత్రాలను ప్రదర్శిస్తున్న బిజెపి నాయకులు. స్టిక్కర్లను అతికిస్తున్న మాజీ అసెంబ్లీ కన్వీనర్ ఈరచిక్కప్ప



కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు. హేమావతిలో శ్రీ సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# శ్రీ సిద్దేశ్వర స్వామి సేవలో కలెక్టర్

**అమరాపురం, నవంబర్ 4:**
హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సిద్దేశ్వర స్వామికి సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణ కుంభ తో వారికి స్వాగతం పలికారు అనంతరం శ్రీ సిద్దేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకం పూజలు చేయించారు. శ్రీ దొడ్డేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ చరిత్రను జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి శ్రీ సిద్దేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. శాలువాలు, పూలమాలలతో సన్మానం చేశారు. ఆలయ అర్చకులు మహా మంగళహారతి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల్ కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయ కుమార్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ దాదా పీర్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా మార్కెట్ యార్డ్ డైరెక్టర్, తిమ్మాపురం జయన్న, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆగలి శివరాం., క్లస్టర్ కో కన్వీనర్ నవీన్ కుమార్ మంజు తారక్, నాయకుడు మారుతి ప్రసాద్ , గొల్ల మారినపల్లి రామచంద్రప్ప ఎంపీటీసీ ఓంకార స్వామి, తిప్పజ్జ, వలస నాగరాజు, నాగోనపల్లి మంజునాథ్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, మాజీ సర్పంచ్ హనుమంతరాయ , మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, రఘు, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ శ్యాం ప్రసాద్ ,ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి సన్మానం చేసిన దృశ్యం



శ్రీ సిద్దేశ్వర స్వామి చిత్రపటాలను అందుకుంటున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి. పూజల్లో పాల్గొన్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు చంద్రశేఖర్ గుప్తా జయన్న శివరాం

# పెద్దిలో మోహిత్ చౌహాన్ పాట

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.






# రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి



ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.

# పిఠాపురంలో అలా మొదలైంది




తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్‌ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.

# దుల్కర్ సల్మాన్ కాంత



మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు.ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.